శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!



# గురుకృప

కృతజ్ఞతా కుసుమాలు - వసివాడని సుమాలు

శ్రీరామనవమి సంచిక

# ప్రేమతత్త్వం

**భక్తుడు :** గురువుగారూ! మీరు ఇంతకుముందు ఒక సత్సంగంలో ఆనందం వైపుకు సాగిపోయే పరిణామం అహాన్ని ఆధారం చేసుకుని ఉంటుంది అని చెప్పారు. చివరకు మనం ఆనందాన్ని పొందినపుడు, మన అహం అనేది లేకుండా పోవాల్సిందే. మరి అలా అయినపుడు అది ఈ పరిణామానికి ఎలా సహాయపడుతుంది? ఎప్పుడు అది లేకుండా పోతుంది?

**గురువుగారు :** అహంలోనే ఆ ప్రేమ రగులుకుంటుంది. ఆ ప్రేమ పెరిగినపుడు ఆ ప్రేమాగ్నిలో అహం దహించబడిపోతుంది. ఇక అదక్కడ ఉండదు. అహం ఆజ్యం వంటిది. ప్రేమనే అగ్నికి ఆ ఆజ్యం తోడవుతుంది. కాసేపటి తరువాత చూస్తే అక్కడది ఉండదు. అది వేరే రూపంలో ఉంటుంది. ఆ దీపాన్ని చూడండి (అక్కడున్న నూనె దీపాన్ని చూపుతూ). ఆ దీపానికి ఆధారమైనది ఏమిటి? నూనె. కానీ కాసేపటి తరువాత, ఆ నూనె ఎక్కడికి పోయింది? (ఆ నూనెలాగా) మరొకదానికి ఆధారమైనది తన స్వంత అస్థిత్వాన్ని కోల్పోవచ్చు. మన అహం, విసుగు, దుఃఖం, తపన, ప్రేమ కోసం మనకు గల అవసరం, సద్గురువు పట్ల మనకు గల ఆర్తి ఇవన్నీ నూనెలా పనిచేస్తాయి. అందుకనే ముందు మనం సాయిబాబా వంటి సద్గురువు కోసం అన్వేషిస్తాం. ఒక్కసారి ఆ ప్రేమ జ్వాల రగులుకున్నాక, ఆ జ్వాల మన అహాన్ని ఆజ్యంగా వాడుకుంటుంటుంది. కనుక అహం అప్పుడసలు లేకుండా పోతుంది. సద్గురువు యొక్క రూపం ఆ మెత్తనైన దీపపు వత్తిలాగా పనిచేస్తుంది. కోల్పోవడం ద్వారా పొందడమనేది ఏదైనా ఉంటే అది కేవలం ప్రేమలో మాత్రమే. జీవితాన్ని కోల్పోవడం ద్వారా జీవితాన్ని పొందుతారని బైబిల్‌లో క్రీస్తు చెప్పింది కూడా ఇదే.



*– శరశ్చంద్రికలు జూలై 2012*

సంపుటి : 21
సంచిక : 2

గురుకృప

మార్చి 25
2018



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో

4 పథగామి – గురుకృప
9 సద్గురు స్వరూపం – దీపం శ్రీ ఎం.కె.స్వామి
10 లక్ష్యసిద్ధిని లభింపచేసే ముచ్చటైన మూడు సూత్రాలు –శరచ్చంద్రికలు
17 కౌపీనం - కాషాయం గౌరీశంకర్ మామ
20 గురుకృపాలహరి – గురుకృప
29 మూలానికి మూలం... ప్రేమ కరవాలం – శ్రీనివాసులు రెడ్డి



నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు

**GURUKRUPA**

Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# పథగామి

## ఆనందం కోసం అన్వేషణ.... ఇచ్చి చూడు!

మనిషికి ఏవేవో కోరికలు. మనిషి కోర్కెలు పెంచడానికి వస్తూత్పత్తి దారులెందరైనా వున్నారు. వస్తు గుణగణాలు తెలియచేయడానికి ఎందరైనా ప్రకటనదార్లున్నారు. కోరికలన్నీ తీరడానికి 'మా వద్ద డబ్బు అప్పు తీసుకోండి' అని ఋణమిచ్చే సంస్థలెన్నో ఉన్నాయి. ఇన్ని సదుపాయాలున్నా వీరెవ్వరి ద్వారా తీరని మన కోరికలు దైవం ద్వారానే తీరగలవనిపిస్తుంది... దైవాన్ని ఆశ్రయించేది తరచుగా ఇలాంటి సందర్భాలలోనే. అన్నీ బాగున్నప్పుడు మనకు దైవంతో నిమిత్తముండదు. మనం అనుకున్నట్లు జరగక ఏదైనా వ్యతిరేకంగా జరుగుతున్నప్పుడు, పరిస్థితులను మనకు అనుకూలంగా చేసుకోవడానికి దైవారాధన మొదలెడతాం. ఆయన విగ్రహమున్న దేవాలయానికి వెళ్ళి అక్కడ ప్రస్ఫుటంగా మన కోరికను వెల్లడించుకుంటాం.

ఏ కోరికా లేకుండా ఏ దేవాలయానికైనా మనం వెళ్ళినట్లు గుర్తుందా? అనగా మనకేదో ఆటంకమో, విఘ్నమో ఎదురైనప్పుడు, లేక అంతకుముందు నువ్వు కోరింది అతడు తీర్చాడనే విశ్వాసంతో ఏదో ముడుపు చెల్లించడానికి బయలుదేరతావు కానీ, ఎన్నడైనా కేవలం నీవీ భూమిపై జన్మించినందుకు, ఇక్కడ ఇంత అందాన్ని చూసినందుకు, అనుభవించినందుకు – ఇదంతా సృష్టించింది ఆయనే కదా అన్న విశ్వాసంతో, కృతజ్ఞతా పూర్వకంగా దైవాన్ని ఆపేక్షగా సంబోధించి ఉంటావా?

అసలు మనలో ఈ ఉనికి పట్ల కృతజ్ఞతాభావం ఎప్పుడైనా పెల్లుబికిందా? ఈ చెట్లు, చేమలు, ఈ సముద్రాలు, పర్వతాలు, ఈ ఆకాశము, నక్షత్రాలు, ఈ సూర్యచంద్రులూ వీటన్నింటిని చూడగలిగినందుకూ, మంచి చెడు, విచారణ చేయగలిగిన మానవుడిగా మనకు జన్మనిచ్చినందుకు మనమెప్పుడైనా కృతజ్ఞత ప్రకటించామా? ఎన్ని ఉన్నప్పటికీ, ఇన్ని ఇచ్చినప్పటికీ ఆయన ఇచ్చాడు అన్న నమ్మకం కలిగిన మనం–మనకు లేనిదేదో గుర్తించి, ఇవ్వలేదని దైవాన్ని నిందించే గుణం, నైజం ఎప్పటికి మారేను? ఇన్ని ఇచ్చిన ఆయనకు ఉన్నదానికి ఏనాడైనా 'కృతజ్ఞతలు' చెప్పుకున్నామా?

ఉదయాన్నే లేచాం, రాత్రి అంతా ఎవరు శ్వాస తీసారు. ఎవరిద్వారా, ఎవరి వలన ఉచ్ఛ్వాస నిశ్వాసలు జరుగుతున్నాయి. ఎవరో పనిచేయబట్టే మనం ఉదయం మేల్కొన్నాం. మేల్కొన్న మనం దైవానికి నమస్కరించుకుంటున్నాం. రాత్రి నే నిద్రిస్తున్నా నిద్రపోకుండా ఈ పనిచేసిన ఆ దైవానికి

**కోరికలతో ఆరాధన చేయడం వలన కోరికపై భక్తియుండునుగాని, దైవంపై భక్తి యుండదు.**



కృతజ్ఞతగా నమస్కారం చేస్తున్నాననే **'భావనే'** రసాత్మకం. సరే మెలకువలోనైనా ఆ భావనతో మనం చేస్తున్నామా? అంటే లేదు.... అన్న సమాధానం వస్తుంది. ఈ గమనింపు, విశ్లేషణ, పరీక్షలలో మనల్ని మనం సరిదిద్దుకుంటూ నిరంతరం ఆ చైతన్యానికి కృతజ్ఞతగా స్మరణ, స్ఫురణ, మౌనం, నమస్కారం, మాట చేతలలో సాగాలి. ఇది సహజం అయ్యేందుకు ప్రయత్నమే సాధన. ఆ సాధనాపథాన్ని ఆచరిస్తూ... చూపుతూ... నిరూపణగా, గురుతుగా (ఉన్నతస్థితిన) నిలిచేవారే గురువు. అందుకే 'గురుతే – గురువు' అన్నారు భగవాన్ రమణులు.

తీరవలసినవే తరువాయి. నీ శ్రేయస్సును కోరే ఆ దైవం నీ కోరికలలో ఏది తీర్చదగునో, ఏది తీర్చకూడదో తానే నిర్ణయిస్తుంది. "కోర్కెలను తీర్చుటలో లేదు నిదానం – వాటిని తీర్చిదిద్దుటే బాబా విధానం" అంటారు శ్రీబాబూజీ.. కాబట్టి కోర్కెల వెంబడి పడవద్దు. "కోరికలకు బానిసలా కాదు – రాజులా ఉండాలి" అంటారు శ్రీబాబూజీ. అసలీ కోరిక ఎలా ప్రారంభమైంది? ఇది నాకు ఉండతగినదేనా? ఇది తీరిన వెంటనే మరో కోరిక ప్రారంభం కాకుండా ఉంటుందని గ్యారంటీ ఏమైనా ఉందా? కాబట్టి సతతము కోరికలు పుట్టించే మనసుని ఒకసారి గమనించు. జాగ్రత్తగా పరిశీలించు అది జనించే సమయంలోనే అంటే ఏ తరుణంలో ఏది చూసినప్పుడు, ఏది తాకినప్పుడు నిన్ను అది ఆక్రమిస్తున్నదో, తొందరపెడుతున్నదో గుర్తించు. ఆ క్షణంలో కనుక అప్రమత్తుడవై ఉన్నావంటే పలురకాల కోరికలను మొగ్గలోనే తుంచివేసే అవకాశం, అవగాహన ఉంటాయి. ఇది నన్ను బాబాకు దగ్గర చేసేదేనా? దూరం చేసేదా? అన్న ఆలోచన కలుగుతుంది. **"నీ మనసుని నాకప్పగించు. నేను నడుపుతాను అంటారు భగవాన్ రమణులు. నీ మనస్సు యొక్క పగ్గాలు నాకప్పగించు అంటారు శ్రీసాయి. మన మనసును అంత తేలికగా అప్పగించలేము. ఆయన మీద విశ్వాసం లేకపోతే ఎలా లొంగిపోగలం? బాబా లీలలు మన మనసును ఆనందంగా ఆయనకు లొంగిపోయేట్లు ప్రభావితం అయ్యేట్లు చేస్తాయి" అంటారు శ్రీబాబూజీ.** ***(సాయిదీవెన నుండి)***

అడిగి పొందేవి వరాలు. అడగకుండా లభించేది కరుణ. అడగడానికి అంతులేదు. అడగడం తెలియక పొందినవన్నీ బాధామయ అనుభవాలే. బంగారు లేడిని అడిగిన సీతకు లభించింది రామ వియోగం. అధర్మకామంతో రాముణ్ణి కోరుకున్న శూర్పణఖ పోగొట్టుకున్నది రెండు ప్రధాన అవయవాలు. ముక్కు, చెవులు, రూపం మాసిపోయింది. అహంకారంతో అన్నాన్ని కోరుకున్న

**భక్తి కోరికపైగాక, దైవంపై ఉంచి ఆరాధన చేసిన బుద్ధి ప్రచోదనమై కర్తవ్య కర్మలు తెలియును.**



దూర్వాసుడు... దుర్భరమైన అజీర్తితో ఆయాసపడ్డాడు. భగవంతుడిని కుమారుడిగా ఆశించిన దేవకికి లాలనభాగ్యం దూరమై ఆ అదృష్టం యశోదకు దక్కింది. "అడిగింది ఇవ్వడం సాయి శపథం – ఆ అడగడం నేర్పడం సాయిపథం" అంటారు శ్రీబాబూజీ.

నడత మంచిదైతే దైవం నీ వెంటే నడుస్తాడు! దైవం మన చుట్టూ ఉన్న సమాజంలో ఉన్నాడు. ఆ సమాజానికి మేలు చేస్తే... దైవానికి ప్రణామం చేసినట్టే! కానీ, ఇది అర్థం చేసుకోకుండా మనం పరమాత్ముడి నుంచి వరాలను ఆశిస్తాం! అడగడం అందరూ చేస్తారు. ఇవ్వడంలోనే జీవన పరమార్థం ఇమిడి ఉంది. "బాబా నాకు ఇచ్చినదేదో అది మీ అందరితో పంచుకోవడం ద్వారా బాబాతో అనుబంధాన్ని, ఋణానుబంధాన్ని పెంచుకోగలుగుతున్నాను" అని విశదపరిచారు శ్రీబాబూజీ. "ప్రేమను వ్యక్తం చేసుకుంటే పెరుగుతుంది" అంటారు శ్రీబాబూజీ.. భగవానుడి కరుణ ప్రసరించాలంటే 'ఇవ్వడం' జీవితంలో భాగం కావాలి. దైవకార్యంలో రెండు రెక్కలూ కోల్పోయిన జటాయువుకు రామచంద్రుడు అగ్ని సంస్కారం చేసి కరుణను కురిపించాడు. రామసేవలో తనువును, మనసును సవినయంగా, సంపూర్ణంగా సమర్పించుకున్న హనుమకు రామకరుణ శాశ్వతత్వాన్ని ప్రసాదించింది. చరితార్థతనిచ్చింది. వికారంగా ఉన్న కుబ్జను అందాలరాశిగా మార్చేసింది శ్రీకృష్ణ కరుణ. ఒక అన్నం మెతుకును అక్షయాన్నం చేసి, ద్రౌపది కష్టాన్ని రూపుమాపింది వాసుదేవుడి కరుణ.

అడిగిపొందే వరం కన్నా... అడక్కుండా వచ్చే కరుణ ఎంతటి గొప్పదో చెప్పడానికే ఈ ఉదాహరణలు. అడగందే అమ్మయినా పెట్టదంటారు కదా! మరి అడక్కుండా దేవుడు ఎలా కరుణిస్తాడు అంటారా? పరమాత్ముడు కరుణ కురిపించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు. ఎందుకంటే ఆయన ఎప్పుడూ మనతోనే ఉంటాడు. ఆయన వెంట (ఈ ఎరుకతో) నడవగలిగితే చాలు. కరుణ ఎప్పుడూ ప్రసరిస్తూనే ఉంటుంది. ఇంకా చెప్పాలంటే భగవానుడి కరుణ మనలోనే ఉంటుంది. మనం సాటివారిపై చూపే కరుణే... భగవానుడి నుంచి తిరిగి మనపై ప్రసరిస్తుంటుంది. సమర్పణ, శరణాగతి, వినయం కలిగి, ఆయన చెప్పినట్లు చేయడం. ఆయన ఉండమన్నట్లు ఉండటం. ఇలా చేయడం వలన ఆయన అనుగ్రహాన్ని అనుభవించగలం. చేసే సేవలే... కరుణకు నాంది పలుకుతాయి. సేవామార్గంలో ప్రయాణించే వారికి దైవకరుణ మహారక్షగా నిలుస్తుంది.

## గురువు చూపిన బాటలో...



ఎప్పుడో దైవం కరుణ కురిపిస్తాడని... సేవాపథంలో నడవడం ఎవరికి మాత్రం సాధ్యం? ఎప్పుడూ ఏదో కోరుకునే మనిషికి... ఇవ్వడం ఎలా అలవాటు అవుతుంది? ఇలాంటి ప్రశ్నలు రావడం సహజం. అయితే అడగడం మాత్రం ఎవరు నేర్పారు మనకు. ఎవరిని ఏది అడగాలో, ఎప్పుడు, ఎక్కడ, ఏది అడగాలో మనం ఎవరినీ అడగడం లేదు! ఇవ్వడమూ అలాంటిదే! ఈ గుణం అంత తొందరగా అబ్బదనుకోండి. సద్గురువుల బోధనలు వింటూ, వారు చూపిన మార్గంలో నడవగలిగితే... మనలో, మనసులో మార్పు మొదలవుతుంది.

## ఎవరి ధర్మం వాళ్లు ....

సేవ చేయడం వల్ల ఏం కలుగుతుంది. సేవామార్గం నిజానికి శ్రేయోమార్గం. వ్యక్తిగత స్థాయి నుంచి సమాజ స్థాయికి తీసుకుపోయే వారధి ఇది. మనిషి చేయగలిగిన అత్యున్నత కర్మ సేవే! వ్యక్తిస్థాయిలో సేవ అహంకారాన్ని నిర్మూలించే దివ్యాస్త్రం. సేవాపథంలో మమకారం తెలుస్తుంది. అపరిమిత ఆదరణ లభిస్తుంది. అనంతమైన ప్రేమ దొరుకుతుంది. అంతిమంగా భగవంతుడి కరుణ ప్రసరిస్తుంది. “మానవసేవయే మాధవసేవ” అన్న సత్యాన్ని గురుదేవుల వాణిలో, బాణీలో గ్రహిస్తే ఇదేమంత కష్టమైన పనికాదు. మనం తప్పక మాధవుడిని దర్శిస్తాము. నలుగురికీ అన్నం పెట్టడం, పదిమందికి దుప్పట్లు పంచడం, ఇద్దరిని చదివించడం... ఇదే సేవ అనుకుంటే ఆ అవకాశం చాలామందికి ఉండదు. ఎవరి ధర్మం వాళ్లు నిర్వర్తిస్తే సమాజానికి మేలు చేసినట్టే.

ఎవరి ధర్మం వాళ్లు నిర్వర్తించాలంటే... ముందుగా ఇవ్వడం నేర్చుకోవాలి. ఇవ్వడంలో ఉన్న ఆనందాన్ని ఎవరికి వారు అనుభవంలోకి తెచ్చుకోవాలి. అడగడం, పొందటం నెమ్మదించాలి. అవి దీనత్వానికి గుర్తులు! దయ, సానుభూతి, జాలి వంటి మానవతా లక్షణాలను నిరంతరం పెంపొందించుకోవాలి. ధర్మాచరణవైపు మనసును మళ్లించాలి. సమాజ అవసరాలను గమనిస్తూ... విలువలు పాటిస్తూ... సమాజ పురోగతిలో క్రియాశీలకంగా ఉండాలి. పరులను బాధించే ఆలోచనలను విడిచిపెట్టాలి. సదా సేవాభావంతో మెలగాలి. అప్పుడు గమనం శాంతియుతంగా సాగుతుంది. గమ్యం ఉన్నతంగా మారుతుంది. దైవంతో కలిసి నడుస్తున్నామన్న అనుభూతి మిగులుతుంది.



జీవితంలో స్థిరత్వం చిక్కాకైనా ఈ కోర్కెల దైవభక్తిని ప్రక్కకునెట్టి (దైవాన్ని ప్రక్కన పెట్టడం కాక) ఆత్మవిద్యను (నిన్ను తెలుసుకునే ప్రయత్నం–ఎందుకీ జీవితంలోకి వచ్చింది) నిరంతరం ఆయనన్న Active Mirror లో నీవెలా ఉన్నావో చూపుతున్న వైనాన్ని గుర్తించి, గమనించి, గ్రహించి సరిదిద్దుకుంటూ ఆయనకు తగ్గ బిడ్డగా ఉండే ప్రయత్నంలో విశ్లేషించుకుంటూ, పరీక్షించుకుంటూ ఉండటమే ఆత్మవిద్య. కనీసం స్థిరత్వం చిక్కినవారన్నా అలా ఉంటే ఇతరులు వారిని అనుసరించే అవకాశం ఉంటుందేమో! నేరిస్తేనే వీరిని చూసిన మిగతావర్గాలు (ఆర్తులు, అర్థార్థులు) కూడా ఆ విద్యను ఆదరించగలరేమో! లేకపోతే భౌతిక సుఖలాలసత్వమే దైవమైపోతుంది.

మనకు కనిపించే సృష్టి రూపంతో ఉన్న దివ్యత్వం–పంచడమే తత్త్వంగా, ప్రత్యక్షంగా కొంత, పరోక్షంగా ఇంకెంతగానో మనకు సేవలు చేస్తూ, మన మనుగడకు పాటుపడుతూ, మనల్ని తనవారిగా ఎన్నుకొని, తనకు తగ్గవాడిగా ఎదిగిస్తున్న తీరుతెన్నులను లీలలో, మన అనుభవాలలో దర్శించే దృక్పథం అలవడితే అంతటా, అన్నిటా ఉన్న దైవానికి కృతజ్ఞతగా నమస్కరించుకోగలం. నమస్కరించకుండా ఉండలేము. ఆయన్ను ఆరాధించడం అంటే ఈ మొత్తానికి కృతజ్ఞతగా ఉండటమే మానవ ధర్మంగా బోధపడుతుంది, అదే మార్గమవుతుంది.

మనం భగవంతుని స్వీకార భావాన్ని గుర్తించక, మరుపుతో నిందిస్తున్నా ఏ మాత్రం పట్టించుకోక మన ప్రేమ అనే మధువు కోసం పడిగాపులు కాస్తూ, (హృదయాబ్జభృంగమై) సుఖలాలసతో మన కోరిక కోరికలు తీరుస్తూనే మన ఆధ్యాత్మిక ఉన్నతి కోసం మనకు తెలియకుండానే (సద్గురు సన్నిధిన మనకు తెలియకనే మనల్ని సాధనా మార్గంలో ఉంచుతారు) మన ముందు రాచబాటను వేస్తూ మనలను ఆ దారిన నడిపిస్తున్న మహామహిమాన్వితుడు, మహోన్నతుడు, అచ్యుతుడు – గురువు.

**గురువుగారూ! బాబాకు కృతజ్ఞతలు ఎలా చెప్పకోగలం?**

**మనం బాబాకు చెందినవారమనే బాంధవ్య భావనతో ఆయన ప్రేమను అనుభూతి చెందడమే నిజమైన కృతజ్ఞత. ఎవరో చెప్పినట్లు గుర్తు.**

**"ఎవరికైనా వారిపట్ల శ్రద్ధను చూపించడం కన్నా ఇవ్వగలిగిన గొప్ప బహుమతి అంటూ ఏమీ ఉండదు" అని. కాబట్టి బాబాకు మీ శ్రద్ధను ఇవ్వండి. అది ఆయనకు కృతజ్ఞత తెలియచేయడమే!**

## సద్గురు స్వ'రూపం' - 'దీపం'

**చీకటిని పోగొట్టువాడు. అజ్ఞానాన్ని తొలగించువాడు – గురువు.**



ఒక మహనీయుని విశ్వసించినప్పుడుగాని, దైవం యొక్క ఒకానొక మూర్తిని ఇలవేల్పుగా స్వీకరించినప్పుడు కాని, మనిషికి "ఆయనున్నాడు, తనకేమి ఫరవాలేదు. అన్నీ ఆయనే చూసుకుంటాడు" అనిపిస్తూ వుంటుంది, అనిపించడం మంచిదే. దాని వల్ల ధైర్యం, స్థైర్యం పెరిగి అవి కర్తోవ్యోన్ముఖమైనప్పుడు అంతకన్నా కావలసింది ఏముంది (ధైర్యం – భయం లేని స్థితి, అభయత్వం; స్థైర్యం – విశ్వాసం, తన మీద తనకి నమ్మకం). అలా కాక అన్నీ ఆయనే చూసుకుంటాడు అన్న భావనతో అలసత్వం ఆవహించి మనకి, లోకానికి పనికి రాకుండా తయారు కావడం మాత్రం మంచిదికాదు. Enjoy, like a child the loving protection of the Sadguru. Be carefree but not careless. - **SriBabuji**

అసలు రహస్యం ఏమిటంటే, అన్నిటికీ ఆయన వున్నాడు అన్నది సత్యం. అన్నీ ఆయనే చూసుకుంటాడు అన్నది తప్పు. ఆయన చూపిస్తుంటాడు. అన్నిటిని చూడగల చూపును, చూపే వెలుగుని ఇస్తాడు. గురువు దీపంలాంటి వాడు. రాత్రిపూట మనం దీపం వెలిగించినప్పుడు ఆ వెలుగులో ఇంటిలోని వస్తువులు ఎక్కడెక్కడ వున్నాయో, ఏ తీరులో వున్నాయో తెలుస్తుంది. యధాశక్తి వాటిని సర్దుకోవడం మన కర్తవ్యం. దీపం సర్దిపెట్టదు. సర్దుకోమని సతాయించదు. సర్దుకోవడం లేదని విడిచివెళ్ళిపోదు. నీవు సర్దుకోదలిస్తే దాని వెలుగు నీకు సహకరిస్తుంది. గురువు అలాంటివాడు. సర్దిపెట్టనప్పుడు దీపం ఎందుకు అని నిందించకూడదు. అక్కర్లేదని భ్రమపడకూడదు. దీపం లేకపోతే ఇంట్లో వస్తువులు ఎలా వున్నది తెలిసెదెలా? కత్తిపీటో, కూర్చునే పీటో అంతుపట్టే మార్గమేది? మన వస్తువులే మనకు అడ్డం వచ్చి మనం వాటిని పాడు చేయడమో, అవి మనలను పడవేయడమో జరుగుతుంది. దీన్ని బట్టి దీపం ఉండి తీరాలి. దాని వెలుగులో మనం సర్దుకోవాలి. (గురువు లేక గమ్యం చేరుకోవడం సాధ్యం కాదు) గురువున్నది మన బాధ్యతలు ఆయన నెత్తిమీద పడవేయడానికి కాదు. పరమప్రేమతో ఆయన అనుగ్రహిస్తున్న విచక్షణా జ్ఞానమనే (వివేక) వెలుగులో మన శక్తియుక్తులను క్రమబద్ధం చేసుకోవడానికి, బాధ్యతలు సక్రమంగా నిర్వహించగలగడానికి.

– శ్రీ ఎం.కె.స్వామి



## లక్ష్యసిద్ధిని లభింపచేసే ముచ్చటైన మూడు సూత్రాలు

**గురువుగారు :** ఇటీవల కొంతమంది వచ్చి, "గురువుగారూ! మాకో సమస్య ఉంది. మమ్మల్ని ఎవరైనా 'మీ గురువుగారిది ఏ రకమైన మార్గం? వారిది భక్తిమార్గమా? అని అడిగినపుడు మేము ఏమని చెప్పాలి?" అని అడిగారు. ఎందుకనంటే నేను భక్తి అనే పదం వాడను. ఇది జ్ఞానమార్గమా అంటే నేను జ్ఞానమనే పదాన్ని వాడను. ఇది కర్మయోగం అందామా అంటే నేను కర్మ అనే పదమూ వాడను. ఆ మాటకొస్తే నేనసలు యోగినే కాదు (గురువుగారు నవ్వుతూ..) అందువల్ల వాళ్లు, "అసలు మేమనుసరిస్తున్న మార్గమేమిటని అందరూ అడుగుతున్నారు, మేము ఏమని చెప్పాలి?" అని అడిగారు. నేను, "గురువుగారిది స్పష్టతతో కూడిన ఆనందమైన మార్గం" అని చెప్పండి అన్నాను. ఇది ఒక మార్గం కాకపోయినప్పటికి సరదాకు అలా చెప్పమన్నాను. కారణమేమిటంటే అన్నింటికంటేముఖ్యమైనది – **స్పష్టత**. ప్రతి విషయంలోనూ స్పష్టత ఉండాలి. మనం అనుకునే ఆ నిర్వాణమో, ముక్తో, మోక్షమో లేదా బాబా సాక్షాత్కారమో – అదేదైనా గాని, – ఒకవేళ మనకు అది వస్తే కూడా దాని పట్ల నిస్సంశయంగా ఉండటానికి స్పష్టత అవసరం. ఉదాహరణకు, కొంతమంది నా దగ్గరకు వచ్చి, "గురువుగారూ! నన్ను నేను తెలుసుకున్నాను అనుకుంటున్నాను! నేను ఆత్మసాక్షాత్కారం పొందడం నిజమేనా? (గురువుగారు నవ్వుతూ) గురువుగారూ, నాకు ముక్తి అనుభవమైంది. నిజంగా నేను ముక్తుణ్ణా?" .. ఇలా అడుగుతుంటారు. వాళ్లకు దానిపట్ల కూడా సందేహముంది. అంటే వాళ్లకు స్పష్టత లేదన్నమాట. నిజానికి మనకసలు ఏ విషయంలోనూ స్పష్టత ఉండదు. **కాబట్టి మనకు ముందుగా కావలసింది స్పష్టత.** దాని వలన కలిగే ఆనందం, మన ఆనందానికి గనుక స్పష్టత లేకపోతే, నిజంగా దానిని మనం ఆనందమని కూడా అనుభూతి చెందలేం. స్పష్టత, ఆనందం అనేవి కలసి ఉంటాయి. అందుకే ఈ మార్గం స్పష్టతతో కూడిన ఆనందమైన మార్గం. దీనికి మీరు ఇంకా ఏమైనా పేర్లు కలిపి పెట్టుకున్నా ఇబ్బందేం లేదు, అవేమంత ముఖ్యం కాదు.

**భక్తుడు :** గురువుగారూ, ఈ స్పష్టత అనేది మనకు మనం సాధించుకునేదా? లేకపోతే మనకు ఎవరైనా ఇస్తే వచ్చేదా?

**గురువుగారు :** మీకు నిజంగా అవసరం ఉంటే, ఆ స్పష్టత వస్తుంది. ఆ స్పష్టతను పొందుతారు.



మీరు ఆ స్పష్టతను సాధించుకుంటారు. నేను దానిని సాధించమనే చెప్తున్నాను. స్పష్టత ఎవరో ఇస్తారని నేను చెప్పడం లేదు, మీరు దానిని సంపాదించుకోవాలని చెప్తున్నాను. "ఊరికే అలా కూర్చోండి మీకు స్పష్టత వస్తుంది. నేను మీకా స్పష్టతనిస్తాను" అని నేను చెప్పను. అది మీకలా అనుభవం కావచ్చేమో కాని, అదేం ముఖ్యమైన విషయం కాదు. నేను చెప్పేది మాత్రం – మీ స్పష్టత మీరే సాధించాలి, సాధించండి!

**గురువుగారు :** చాలా మంది దేనినీ సరైన రీతిలో పూర్తిగా చేయలేరు. అలాంటి వారికి నేను, "నాకు ఇది నిజంగా ఎంతవరకు అవసరం? నిజంగా అవసరమా?" అనే స్పష్టత తెచ్చుకోమని చెబుతాను. ఆ స్పష్టత వచ్చాక, అంటే ఉదాహరణకు వాళ్లు, "నా తొలి ప్రాధాన్యత ప్రాపంచిక బాధ్యతలు, నా కుటుంబ బాధ్యతలు చూసుకోవడం–ఇది ఎనభైశాతం. మిగతా ఇరవైశాతం అవసరం ఆధ్యాత్మికపరమైనది. ఇది తప్పకుండా ఉందికానీ, కుటుంబపరమైన, వృత్తిపరమైన మిగతా అవసరాలు ఎక్కువగా ఉన్నాయి" అని చెప్పారనుకోండి. మీకు అటువంటి స్పష్టత ఉన్నప్పుడు, మీరు ఆధ్యాత్మిక విషయాలలో ఆ ఇరవై శాతాన్ని వినియోగించుకొని ఆనందానుభూతి పొందుతారు. ఈ ఇరవైశాతంతో పాటు ఇంకా మిగిలిన ఎనభై శాతాన్ని కూడా ఆనందంగా ఆస్వాదించగలరు. ఆ స్పష్టత గనుక మీకు లేనట్లయితే సంఘర్షణలో ఉంటూ, ఆ ఊగిసలాటలో జీవిస్తూ – ఇటు ప్రాపంచికంగానూ సరిగా ఉండలేరు, అటు పారమార్థికంగాను సరిగ్గా ఉండలేరు. అందుకనే నేను, మొదట మిమ్మల్ని స్పష్టత తెచ్చుకోమంటాను. మీరు ఇక్కడ ఎందుకోసం ఉన్నారు? "మేము ఆధ్యాత్మిక సాధకులం, మా జీవితాలన్నీ పూర్తిగా ముక్తికి, మోక్షానికి అంకితం. కానీ ఇతర అవసరాలు మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాయి" అని చెప్పి మిమ్మల్ని మీరు వంచించుకోవద్దు. ఇలా చెప్పుకోవద్దు. నిజంగా ముక్తికోసం కలత చెందేవారికి ఈ "ఇతర అవసరాలు ఉండవు. వారు రమణమహర్షిలా ఉంటారు. కానీ మనకు ఆయనకున్న స్వచ్ఛమైన స్వభావం, ఆయనంత స్థాయి లేవు. చాలా వ్యామోహాలు మనల్ని లాగుతున్నాయి. మనకు స్పష్టత, అవగాహన లేకపోవడం వలన మనం చాలా వైపులకు అలా లాగబడుతూ పెనుగులాటలో ఉంటాం. మన అవసరాలు మనల్ని అనేకరకాలుగా కొన్ని ఇటువైపు, కొన్ని అటువైపు లాగుతున్నందువల్ల ఈ అవసరాలు తీర్చుకోవడంలో మనకు వైరుధ్యం, సంఘర్షణ ఏర్పడుతుంది. కానీ మీరు స్పష్టత తెచ్చుకొని, ఆ అవసరాలను క్రమపద్ధతిలో పెట్టుకొని సామరస్యాన్ని



**సత్యసాధకునకు గమ్యం చేరుట ప్రధానంగాని, ఆహార నిద్ర మైథున కార్యాలు అప్రధానం.**



సాధించగలిగితే అవి ఒకదానితో ఒకటి ఘర్షణ పడకుండా, పోటీ పడకుండా ఉంటాయి. అలా అయినపుడు మీరు కనీసం మీ అవసరాలనైనా సామరస్యంతో అనుభవించ గలుగుతారు.

మన మనసులో ప్రతి విషయం యొక్క స్థానం ఏమిటనే స్పష్టత వచ్చాక, మన జీవితంలో ప్రతి అణువునూ ఎటువంటి సంఘర్షణ, వైరుధ్యం లేకుండా మనం పరిపూర్ణంగా అనుభవించగలం.నేను, ఈ సంఘర్షణ నుండి మిమ్మల్ని మీరు విముక్తి చేసుకోండి అంటున్నాను. అయస్కాంతం, ఇనుపముక్క ఉదాహరణలో గల మూలసూత్రం వంటిదే ఇది – దీనిని మీకు అన్వయించుకోండి. ఇనుపముక్కకు, అయస్కాంతానికి గల తేడా ఏమిటి? రెండింటిలోను అణువుల సంఖ్య సరిసమానంగా ఉంటుంది. వాటిని వేరుచేసేదేమిటంటే – అయస్కాంత క్షేత్రంలో వున్న ప్రతి అణువు క్రమబద్ధంగా, ధృవీకృతమై మిగతా అణువులతో సామరస్యాన్ని కలిగి ఉంటుంది. దాని అస్తవ్యస్తత నశిస్తుంది. అది అయస్కాంతంగా మారుతుంది. ఇనుపముక్కను అయస్కాంతంగా మార్చడానికి సులభమైన మార్గం దానిని మళ్లీ మళ్లీ అయస్కాంతంతో రుద్దడం, దానిని అయస్కాంత స్పర్శలో ఉంచడమే. క్రమంగా అయస్కాంత సాంగత్యం వల్ల ఇనుప అణువులు తమ అస్తవ్యస్తతను కోల్పోయి క్రమతను పొంది ధృవీకృత మవుతాయి. నెమ్మదిగా, అవి ఒకదానితో ఒకటి ఒద్దికను పొంది సమగ్రతను సాధించి వాటికవే అయస్కాంతంగా మారతాయి. మన విషయంలో మనమంతా ఇనుపముక్కలం, బాబా మన అయస్కాంతం. బాబాను గుర్తుపెట్టుకోవడం, మన మనస్సును తిరిగి తిరిగి బాబా మీద లగ్నం చేయడం, మనల్ని మనం ఎంత వీలైతే అంత బాబా సన్నిధిలో ఉంచుకోవడం, శిరిడీకి వెళ్లడం ద్వారా భౌతికంగా కూడా ఆయన సన్నిధిలో ఉండడం, ఇవన్నీ తిరిగి తిరిగి అయస్కాంతంతో రుద్దడం వంటివే. తద్వారా మనం సామరస్యాన్ని సాధిస్తాం.

**గురువుగారు :** నేను మిమ్మల్ని ఫలానా పనిచెయ్యమని అడగడంలేదు. మీరు వచ్చి మేము ప్రేమించేటటువంటి లక్ష్యం (సద్గురువు) 'ఫలానా' అని అన్నప్పుడు మీ ఆనందం అందులోనే ఉందని చెప్పినపుడు, మీరు దానిని పొందేదాకా దాని మీదనే లగ్నం చేయండి అంటాను. "నా ఆనందం ఇందులో ఉంది" అని మీరు అంటున్నారు కానీ దానికోసం ఏమీ చేయడం లేదు. దానిమీద దృష్టి పెట్టండి! మీరు, "నేను పరీక్షలో పాస్ కావాలనుకుంటున్నాను. ఇది నాకు చాలా అవసరం, నాకు ఈ డిగ్రీ కావాలి" అంటారు. వచ్చి ఇలాగే అడుగుతుంటారు. నేను చెప్పగలిగింది ఏముంటుంది?



"మంచిది, మీకు నిజంగా అంతగా పాస్ కావాలనుకుంటే కష్టపడి చదవండి!" అంటాను. నేను మిమ్మల్ని పరీక్షలో పాస్ కమ్మని చెప్పడం లేదు, ఆ డిగ్రీ తెచ్చుకోమని చెప్పడంలేదు, అలాంటిదేం లేదు. కానీ మీరు నా దగ్గరకు వచ్చి, "నాకు ఈ డిగ్రీ కావాలి, నేను ఈ పరీక్షలో పాస్ కావాలి"! అని చెప్పినపుడు, నేను 'ఇదిగో ఇలా చెయ్యండి' అని చెప్తాను. మీరు ఈ పరీక్షలో పాస్ కావాలనుకుంటున్నాము అని చెప్తూ, రోజూ సినిమాలకు పోతూ, స్నేహితులతో పిచ్చాపాటీ కబుర్లు చెప్పుకుంటూ, సముద్రపు ఒడ్డున తారట్లాడుతూ ఉంటే, అపుడు నేను "ఇది పద్ధతి కాదు, మీ రూములో కూర్చుని కష్టపడి చదవండి" అంటాను. ఇదీ నేను చెప్పేది.

మీరు గనుక, "లేదు, లేదు, నేను ఇంత కష్టపడి చదవాల్సివస్తే నేను ఈ పరీక్షలో పాస్ కావాలనుకోవడం లేదు, ఇదంతా అవసరం లేదు" అన్నారనుకోండి. అపుడు మీకు కనీసం ఆ స్పష్టతయినా ఉంటుంది! అలా కాకుండా మీరేమో నా దగ్గరకొచ్చి, "గురువుగారూ! మేము అంతదూరం నుండి మీ కోసం వచ్చాము, మీ సాన్నిధ్యాన్ని పూర్తిగా అనుభూతి చెందాలనుకుంటున్నాం గురువుగారూ!" అని చెబుతున్నారు. ఇలా చెప్పినపుడు "అలా అయితే సరైన పద్ధతిలో చెయ్యండి" అని మాత్రమే నేను చెప్పగలను. నేను చెబుతున్నదీ అదే. (గురువుగారు గుసగుసలను అభినయిస్తూ..) "రండి, నా సాన్నిధ్యాన్ని అనుభవించండి!" అని నేను మిమ్మల్ని ఇక్కడకు రమ్మని పిలువలేదు. నేను ఎన్నడూ అలా చేయలేదు. ఇక్కడకు వచ్చి "మేమిక్కడ ఎంతో సంతోషంగా ఉన్నాం, మాకు ఇక్కడ సంతృప్తిగా ఉంది. మేము మీ కోసం వచ్చాం" అని చెప్పింది మీరు. **నిజంగా మీరు నా కోసం వచ్చుంటే దానిని చేతల్లో చూపించండి. ఆమూలాగ్రమూ అలా చేయండి.** అలా కాకపోతే, ఎందుకు ఇక్కడ మీ సమయం వృధా చేసుకోవడం? వెళ్లి మీకు మరింత లాభమొచ్చేటటువంటి, ఉపయోగకరమైన ఇతర విషయాలను సాధించుకోండి. నా ఉద్దేశ్యమిది. మీకు ఒక **లక్ష్యాన్ని నేనెన్నటికీ నిర్దేశించను. మీ లక్ష్యాన్ని సాధించడానికి నేను సహాయం మాత్రమే చేస్తాను.** మీ లక్ష్యం మీరే నిర్ణయించుకోవాలి. అలా నిర్ణయించుకున్న తరువాత, ఇతర బంతులు వచ్చి మీ లక్ష్యాన్ని తాకకుండా మంచి గోల్‌కీపర్‌లాగా దానిని కాపాడుకోవాలి.

**గురువుగారు :** నేను ఈ విషయాన్ని ఎన్నోసార్లు చాలా చాలా స్పష్టంగా చెప్పాను. "ఇది చాలా మంచి లక్ష్యం, దాని తరువాత రెండవస్థానం ఆ లక్ష్యానిది" అని మీ లక్ష్యాల విషయంలో నేనెప్పుడూ



సలహాలివ్వను. మీ లక్ష్యం యొక్క ఎంపిక మీదే. మీ లక్ష్యాన్ని మీరే ఎంచుకోవాలి! **ఎలా ఎంచుకోవాలి? ఇది నేను చెప్తాను.** ఏదైతే మీకు అత్యంత సంతోషాన్ని కలిగిస్తుందో, మీ హృదయంలో ఎక్కువ ప్రేమను కలిగిస్తుందో అటువంటి దానిని ఎంపిక చేసుకోండి. అది ఏదైనా ఫరవాలేదు. అది సామాజిక సేవయినా, పర్యావరణ సంరక్షణయినా మరేదైనా సరే వెళ్ళి ఆ పని చేయండి. మీకది ఆనందాన్నిస్తూ ఉంటే వెళ్లండి. అది మీ లక్ష్యమైతే నేను దానికి వ్యతిరేకిని కాదు. అంకితభావంతో, సంతోషంతో ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనేవారిని నేను గౌరవిస్తాను. వారు దారి తప్పారనో, ఆధ్యాత్మిక పంథాలో లేరనో నేను అనను. వారిపట్ల నాకు అంతే సమంగా గౌరవభావముంది. అయితే మీ లక్ష్యాన్ని మీరే ఎన్నుకోవాలి. వాళ్ళ వాళ్ల లక్ష్యం పట్ల ఎంత అంకితభావంతో, తదేకతతో ఉన్నారో మీరూ మీ లక్ష్యం పట్ల – అది బాబాను ప్రేమించడమైనా, మరొకటైనా – అంతే తదేకతతో ఉండాలి. అందరికీ నేనిచ్చే సలహా ఏమిటంటే, **మీ హృదయంలో ప్రేమను కలిగిస్తూ, మిమ్మల్ని ఆనందభరితుల్ని చేసేటటువంటి దానిని ఎన్నుకోండి, దానికి కట్టుబడి ఉండండి, దానిపైన ఇంకా ఇంకా దృష్టి పెట్టండి.**

**భక్తుడు :** కానీ గురువుగారూ, మా లక్ష్యంపట్ల దృష్టిని (ఫోకస్) నిలుపుకోవడం ఎలా? క్షణమాత్రంలో దానిని కోల్పోవచ్చనిపిస్తుంది.

**గురువుగారు :** దృష్టిని నిలుపుకోవాల్సిన అవసరం లేదు. లక్ష్యం ప్రేమ నుండి వచ్చినదైతే, దృష్టిని నిలుపుకోవడానికి నిర్వహణా బాధ్యతలు నిర్వర్తించాల్సిన అవసరముండదు (గురువుగారు నవ్వుతూ) మీకు గనుక ప్రేమ వుంటే, మీరు దృష్టి పెట్టే లక్ష్యాన్నుంచి మీరు ప్రక్కకు మళ్లలేరు, మీవల్లకాదు. అదీ లగ్నం చేయడమంటే. మీరు ఒకరిని ప్రేమించారంటే, ఆ వ్యక్తి గురించి ఆలోచించకుండా ఉండటమనేది చేయలేరు. మీ ఆలోచనలు ఎప్పుడూ తిరిగి తిరిగి ఆమె మీదకో, లేదా అతని మీదకో పోతూనే ఉంటాయి. కానీ కొన్నిసార్లు పాత అలవాట్లు లేదా పాత సాంగత్యాల వల్ల, మనం ప్రేమిస్తున్నప్పటకీ కొన్ని విచారకరమైన ఆలోచనలు వస్తుంటాయి. మనం వాటిని దూరం చేసుకోవాలనుకున్నప్పటికి మన వల్ల కాదని తెలుస్తుంది. లేకపోతే కొన్ని అడ్డంకులు వస్తాయి. మనం ఎదుర్కోక తప్పని అడ్డంకులెదురవుతాయి. ఇటువంటి సందర్భాలలో మన దృష్టిని నిలుపుకోవడానికి ఇతర విషయాలు – సత్సంగం, మంచి సాంగత్యం, మనం ఇక్కడ ఎందుకున్నాం,

మన లక్ష్యమేమిటి అని ఆలోచించడం – ఇటువంటి మంచి విషయాలు సహాయం చేస్తాయి. మీరందరికీ ఇలాగ దృష్టిని నిలుపు కోవడానికి అవసరమైన సూత్రాలు బాగా తెలుసు. మీకు నచ్చినదానిని ఉపయోగ పెట్టుకోండి.



**భక్తుడు :** గురువుగారూ,మా సంతోషానికి, దుఃఖానికి మేమే బాధ్యులమని అంగీకరించగలిగితే మేము ఆనందంగా ఉంటామని చెబుతున్నారా?

**గురువుగారు :** మీరు ఆనందంగా ఉన్నా, లేకపోయినా మీరు ఏ దుఃఖమైతే బయటినుండి వస్తుంది అనుకుంటున్నారో కనీసం అదన్నా ఆగిపోతుంది.

**భక్తుడు :** ఆ బాధ్యత మాదేనని అంగీకరించడం వల్లనా?

**గురువుగారు : మీ ఆనందానికిగాని, దుఃఖానికి గాని ఇతరులు బాధ్యులు కారని తెలుసుకోవడం ద్వారా, ముందు మీరు వాళ్లకు విముక్తి కల్పిస్తారు, తరువాత వాళ్ల నుండి మిమ్మల్ని మీరు విముక్తుల్ని చేసుకుంటారు, కొంతలో కొంతైనా ఓ విధమైన స్వాతంత్ర్యం , విముక్తి పొందుతారు.**

**భక్తుడు :** గురువుగారూ, ఆ విధంగా మమ్మల్ని మేము చూసుకోవడం ఎలా? మేమే (ఆనందానికి, దుఃఖానికి) బాధ్యులమని నిజంగా తెలుసుకోవడం ఎలా?

**గురువుగారు :** ముందుగా ఇతరుల్ని నిందించడం ఆపండి. స్పష్టంగా ఉండండి! అపుడు అది సులభమవుతుంది. మనల్ని మనం భ్రమలో పెట్టుకొని దానిని ఒక సమస్య చేసుకుంటాం. తర్వాత అది ఒక అలవాటుగా, ఆలోచనాసరళిగా మారుతుంది. అందుకనే నేను చెప్పేది: ముందు మీరు దానిని ఆపితే – ప్రపంచంలో మీరు నిందించడానికి ఇక ఎవ్వరూ లేకపోతే – మీకు నిందించుకోవడానికి మీరు, లేదంటే బాబా తప్ప ఇక ఎవ్వరూ లేరనే కనీస స్పష్టతన్నా వస్తుంది.

ఇప్పుడు నేను చెప్పేదానిని ప్రతి ఒక్కరూ తమ స్వంత సమస్యలను ఆధారం చేసుకొని, వారి వారి అవగాహనను, దృక్పథాన్ని అనుసరించి, తమతమ రీతుల్లో అర్థం చేసుకుంటారు. కానీ అందరికీ వర్తించే(సార్వత్రికమైన) విషయానికొస్తే – అందులో మూడు అంశాలు ఉన్నాయి. వీటిని ఎప్పుడూ గుర్తుంచుకోండి. ఇప్పటి వరకు జరిగిన అన్ని సత్సంగాలు, నేను గంటల తరబడి మాట్లాడిన మాటలు – వీటన్నింటికీ ముఖ్యమైనవి మూడు అంశాలు.



**మొట్టమొదట** మీకొక లక్ష్యం, ఒక ధ్యేయం వుండాలి.మీకు ఏం కావాలో, మీరు దేని కోసం తాపత్రయపడుతున్నారో మీకు తెలియాలి. ఒకవేళ మీకు ధ్యేయమంటూ ఒకటి వుంటే ఆ ధ్యేయాన్ని గుర్తుపెట్టుకోండి. మీరు తిరువణ్ణామలైకిగాని, శిరిడీకిగాని వస్తున్నపుడు మీకొక ధ్యేయమో లేదా లక్ష్యమో ఉందని భావిస్తారు. కనీసం ఏదో ఒకటి ఉందనైనా అనుకుంటారు. అది ఏదైనా సరే, అసలు మీరు దానిని గుర్తుంచుకుంటున్నారా? **మనం ఇక్కడ ఎందుకున్నాము? మనం ఎందుకోసం వచ్చాము?** దీనిని ఎప్పుడూ గుర్తుపెట్టుకోండి.

**రెండవది** మనం లక్ష్యంపట్ల, ధ్యేయంపట్ల మనకుండే ఈ ఎఱుక, మన చుట్టూ ఉండే రకరకాల పరిస్థితుల వల్ల నీరుగారి పోకుండా, దారితప్పిపోకుండా, మరలి పోకుండా, కాపాడుకుంటూ, మనల్ని ఆకర్షణకు లోనుచేసే పరిస్థితులను కట్టడి చేసుకుంటూ, మన లక్ష్యానికి దూరం కాకుండా ఉండాలి. మన లక్ష్యం, దానిమీద మనం దృష్టిపెట్టడం రెండూ పరస్పరం ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. కాబట్టి మన లక్ష్యంపట్ల మనం నిజంగా జాగరూకతతో ఉన్నామా, లేక ప్రక్కకు లాగబడి దారి తప్పి పథభ్రష్టులమయ్యామా అని తెలుసుకోవడానికి ప్రతిరోజూ మీరు ఏం చేస్తున్నారు? ఎక్కడికి పోతున్నారు? అనే విషయం చూసుకోండి.

**మూడవ అంశం,** ఏది మనలో ప్రేమను కలిగిస్తుందో ఆ సాంగత్యంలో ఉండటం, దానిమీద దృష్టి ఉంచడం, మనం మన లక్ష్యంపట్ల మనకు గల తదేకతను పెంపొందించే పనులు చేస్తున్నామా? నిజంగా అటువంటి పనులే చేస్తున్నామా? మన లక్ష్యంపట్ల మనం జాగ్రత్తగా ఉంటున్నామా? మన ధ్యేయం స్థిరంగా ఉందా? మనం దానిని గుర్తుపెట్టుకుంటున్నామా? లేదా మరచిపోతున్నామా? మీరు రోజు ఎలా గడుపుతున్నారు అనే దానిని గమనించండి – గత ఇరవై సంవత్సరాల సంగతి కాదు – అది అవసరం లేదు, **ఒక్క రోజును పరిశీలించండి! మీరు ఒక్కరోజును మచ్చుకి తీసుకొని, మీరు ఎలా గడుపుతున్నారో పరిశీలించుకోండి. మిమ్మల్ని మీరు "నేనిక్కడకు ఎందుకు వచ్చాను? నేను ఏం చేస్తున్నాను? నేను ఏం ఆశిస్తున్నాను?"** అని రోజుకు ఒక్కసారైనా ప్రశ్నించుకుంటున్నారా? "మేమిక్కడకు ఆత్మవిచారణ కోసం, రమణమహర్షి కోసం, భగవానుల కోసం, అరుణాచలేశ్వరునికోసం, బాబా కోసం, గురువుగారూ మీ కోసం" ఇక్కడకు వచ్చామనో అనవచ్చు. అయితే వచ్చి మీరిప్పుడు ఎన్ని గంటలు లేదా ఎన్ని నిమిషాలు **– "గంటలు" అనడం మరీ ఎక్కువేమో – ఎన్ని నిమిషాలు**



**మీరు నిజంగా ఆ విషయం మీద దృష్టి పెట్టి గడిపారు?** నిజాయితీగా సమాధానం చెప్పండి. పోనీ, గడిచిన ఇరవైనాలుగు గంటల్లో మీ లక్ష్యం కోసం మీరేం చేశారు?

ఆలోచించండి మీరు ఇక్కడెందుకున్నారు? మీరు మీ లక్ష్యాన్ని, మీ ధ్యేయాన్ని గుర్తు పెట్టుకుంటున్నారా? మిమ్మల్ని మీ లక్ష్యం నుండి దూరం చేసే ఇతర ప్రభావాల నుండి, ఆకర్షణల నుండి, కార్యకలాపాల నుండి మిమ్మల్ని కాపాడుకోవడానికి నిజంగా ప్రయత్నిస్తున్నారా? మీరు నిజంగా మీ లక్ష్యంవైపు, ప్రేమించే మీ ధ్యేయంవైపు అడుగులేస్తున్నారా? అలా అయితే అందుకోసం నిజంగా మీరేం చేస్తున్నారు? చివరిది, నేను పదే పదే చెప్పేటటువంటిది, మనమందరం గుర్తుపెట్టుకోవాల్సిన ప్రాథమికమైన, అత్యంత **ముఖ్యమైన విషయం : జీవితం యొక్క అల్పత్వం – ఎంత చిన్నది ఈ జీవితం! మీరు సమయాన్ని ఎలా గడుపుతున్నారో, ఎలా వృధా చేస్తున్నారో చూడండి.** రేపు మనం ఎక్కడుంటామో మనకు తెలియదు. అయినప్పటికి మనం శాశ్వతమైనట్లు, అజరామరులమైనట్లు సృష్టి లయించే వరకు ఉండబోతున్నామనుకుంటూ ప్రణాళికలు వేసుకుంటూ, కూడబెట్టుకుంటూ, కాపాడుకుంటూ" ఇవన్నీ అవసరమా? **స్పష్టమైన అవగాహన తెచ్చుకోండి.**

**–శ్రీబాబూజీ**

## కౌపీనం - కాషాయం

నేను రాముడిని కాకపోయినా నా తమ్ముడు చంద్రశేఖర్ నిజంగా లక్ష్మణుని వంటివాడే. భారతీయ వాయుసేనలో కార్పోరల్‌గా చేస్తున్నాడు. ఇవ్వకూడని ఇంజక్షన్ ఇవ్వడం వల్ల కోమా దశలో పూణేలోని సదరన్ కమాండ్ మిలటరీ ఆసుపత్రిలో ఉన్నాడు. తమ్ముణ్ణి చూడడానికి కలకత్తా నుండి వచ్చాను. బ్రిగేడియర్‌గా ఉన్న డా॥ నారాయణ అయ్యర్ నా తమ్మునికి చికిత్స చేస్తున్నారు.

"వేలల్లో ఒక్కరు మాత్రమే ఈ స్థితి నుండి బయటపడగలరు కనుక మా చేతుల్లో ఏమిలేదు. మీ దేవుణ్ణి, ఆచార్యులను ప్రార్థించండి" అని నాతో అన్నారు. నేను నా తల్లి వద్దకు వచ్చాను. ఎందుకు వాణ్ణి వదలి వచ్చావు అని నన్ను అమ్మ అడిగింది.

"పరమాచార్య స్వామివారిని దర్శించాలని అనుకుంటున్నాను అందుకే ఇంటికొచ్చాను"



"నాతో పాటు వస్తావా?" అని అడిగాను.

"నన్ను తిరువణ్ణామలైలో వదిలిపెట్టు. నేను శేషాద్రి, రమణుల వద్ద ఉంటాను."

"నేను ముందు పెరియవను దర్శించుకుంటాను అని సంకల్పం చేసుకున్నాను. అటు తరువాత నిన్ను తిరువణ్ణామలైలో వదిలిపెడతాను" అని చెప్పాను. ఇద్దరమూ కాంచీపురం వెళ్ళాము. కాని మహాస్వామి వారు అక్కడలేరు. తిరుమిలిసై ఆళ్వారుల 1001వ జయంతి ఉత్సవాలకని ఒరిరిక్కై వెళ్లారు. మేము ఉదయం ఆరు గంటలకు ఒరిరిక్కై చేరుకున్నాము. అమ్మ ఒక చెట్టు కింద నున్న బండపైన కూర్చున్నారు. "అమ్మా! నాన్నగారు పోయాక ఎలాగూ నువ్వు పూర్వ సువాసినిలా కాశీలో ముండనం చేసికొని, తెల్లచీర కట్టుకుని ఉన్నావు. నువ్వు కూడా పరమాచార్యుల దర్శనానికి రావచ్చు కదా?" అని అడిగాను.

"లేదు రా, నేను రమణులను, శేషాద్రిని తలచుకుంటూ ఇక్కడే ఉంటాను. నువ్వు స్వామివారి దర్శనం చేసుకున్న తరువాత నన్ను తిరువణ్ణామలై తీసుకునివెళ్ళు''. ఆమె సమాధానంతో కాస్త చికాకుపడి, "కావాలనే పరమాచార్య స్వామి వారి దర్శనం చేసుకోకుండా ఉంటే, భగవాన్ రమణులు, శేషాద్రిస్వామి వారు నిన్ను అనుగ్రహిస్తారనుకుంటున్నావా?" అని అడిగాను. "చూడు, నాతో వాదించకు, నువ్వు వెళ్లి దర్శనం చేసుకో, నిన్ను నేను అడ్డుకోవడం లేదు. నేను ఇక్కడే ఉంటాను" ఈ మనస్తత్వం ఉన్న నిన్ను, వందమంది రమణులు, శేషాద్రిస్వాములు కూడా కాపాడలేరు అని లోపలకు వచ్చి స్వామివారికి సాష్టాంగం చేశాను. తమ్ముని దీనస్థితిని తలుచుకుని గొంతు గాద్గదికమవుతుండగా తిరువేంబావై నుండి 19వ పాశురాన్ని పాడాను.

తన్నుకొస్తున్న దుఃఖం వల్ల పాశురాన్ని పూర్తి చెయ్యలేకపోయాను. ఒక్క క్షణంపాటు నా తత్తరపాటును గమనించి, "పాశురాన్ని పూర్తిచెయ్యి" అన్నారు. స్వామి ఆజ్ఞమేరకు పూర్తిచేశాను.

"ఒంటరిగా వచ్చావా?" అని అడిగారు స్వామివారు. "అమ్మతో పాటు వచ్చాను"

"అయితే, ఏమిటి విషయం?" నా తమ్ముని దుస్థితిని స్వామి వారికి తెలిపాను.

"మూత్రపిండం దెబ్బతినిందా?" అని అడిగారు. "లేదు". చేతితో స్వామివారు తన తలను చూపించారు. "అవును, మెదడు దెబ్బతినింది" అని చెప్పాను. చేతితో తామరాకులో కొంచెం



కుంకుమ వేసి, రెండు నిముషాలు ధ్యానమగ్నులై కళ్ళు మూసుకున్నారు. "నువ్వు ఇప్పుడు కలకత్తా వెళ్తున్నావా?" అని అడిగారు.

"లేదు పెరియవ. మా అమ్మని తిరువణ్ణామలైలో విడిచి, పూణే వెళ్ళి కలకత్తాకు వెళ్తాను" అని బదులిచ్చాను. "వెంటనే ఈ కుంకుమని పూణేలో ఉన్న నీ తమ్ముడికి పంపు" అని చెప్పారు. మరో పదినిముషాల పాటు ఇతర భక్తులతో మట్లాడారు.

తరువాత నన్ను ఆశ్చర్యపరుస్తూ శ్రీవారు తమ కౌపీనాన్ని సర్దుకుని, పైకి లేచి కాషాయ వస్త్రాన్ని విప్పి రెండు మడతలు వేసి భుజంపైన వేసుకుని, ఎడమచేతిలో దండం పట్టుకుని బయటకు వెళ్తున్నారు. ఆ కౌపీనధారి కొద్ది దూరం నడిచి మా అమ్మ వద్దకు వెళ్ళారు. ఆమె స్వామివారిని చూడగానే ఆనందపరవశురాలై కాళ్ళపై పడి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

అమ్మకి పరమాచార్యస్వామి వారి మొదటి ప్రశ్నయే. "మీ మాతామహుల పూర్వీకులు ఎక్కడివారు?" తిరువణ్ణామలై అని అమ్మ చెప్పింది. "మీరు శేషాద్రి స్వామివారిని చూశారా? ఆయన మీ ఇంటికి వచ్చారు కదూ?" అని అడిగారు. ఈ ప్రశ్నతో చాలా సంబరపడింది.

"అవును" "వారు ఏం చేసేవారు?" "నన్ను వండిన అన్నాన్ని ఇమ్మనేవారు. చాలా వేడిగా ఉందని చెప్పేదాన్ని. కాని నాకు చాలా ఆకలిగా ఉందని నా మాటలను పట్టించుకునేవారు కాదు. అంతటి కాలుతున్న అన్నంలో చెయ్యిపెట్టి తినేవారు. సరిగ్గా రెండుసార్లు తినగానే తినడం ఆపేవారు. తరువాత మేమందరం దానినే తినేవారం"

"భగవాన్‌ని చూశారా?" అని అడిగారు ఈసారి. "అవును వారి ముందే మేము పాడేవారం"

"మీరు అక్షర మణిమాల పాడుంటారు కదూ" "అవును. తెల్లవారురఝామున మూడున్నర నుండి వరుసగా వేంకటేశ్వర సుప్రభాతం, భగవద్గీత, వల్లల్లార్ తిరువరుత్ప, పాటలు పాడేవారం" "ఇప్పుడు ఎక్కడికి వెళ్తున్నారు?" "నన్ను తిరువణ్ణామలై తీసుకుని వెళ్ళమని వాణ్ణి అడిగాను" పరమాచార్యస్వామి వారు నడిచి వెళ్ళిపోయారు. మహాస్వామి వారు తనతో భగవాన్ రమణులు, శేషాద్రిస్వామి గురించి అడిగారని అమ్మ ఎంతో ఆనందపడింది. ఇంకా నాతో అన్నది, "నువ్వు వారిని గమనించావా? నువ్వు వారిని పెరియవ అన్నావు, కాని వారు నా వద్దకు కౌపీనధారియై

**తెలిసిన అర్థమును మనస్సు నిర్లక్ష్యము చేయును. తెలియని అర్థమునకు వైముఖ్యము వహించును.**



వచ్చారు. భగవానుల దేహంలా వారి దేహమూ కాంతివంతముగా ఉంది. వీరి స్థితి కూడా రమణుల స్థితివలె తోస్తోంది. నువ్వు ఇది గమనించావా! వారి మాటతీరు అచ్చం శేషాద్రిస్వామి వారి మాటలలాగే ఉంది. రమణులు, శేషాద్రిస్వామివారే కావాలి. పరమాచార్య స్వామి వారిని దర్శించను అన్న వ్యక్తికి మహాస్వామి వారు రమణులవలె కనిపించి, శేషాద్రిస్వామి వారివలె మాట్లాడారు అని కొన్ని రోజుల తరువాత నాకు స్ఫురించింది.

రెండురోజుల్లో కుంకుమను నా తమ్మునికి పంపాను. అతని నుదుటికి, శరీరమంతా దాన్ని అలదారు. రాత్రి పదకొండు గంటలప్పుడు మగతగా పెరియవ పెరియవ అని కలవరించాడు. ఏదో చెయ్యాలని తాపత్రయపడి మంచంపైనుండి కిందకు పడిపోయాడు. ఏడుస్తూ, "ఓ! నేను పాపిని. సాష్టాంగం చెయ్యలేకపోతున్నాను. వారు వెళ్లిపోతున్నారు" అని అన్నాడు.

అక్కడకు పరమాచార్య స్వామివారు వచ్చారని ఆపాదమస్తకం రెండు మూడు సార్లు తనని తీక్షణంగా చూశారని, వారికి నమస్కరించడానికి తన శరీరం సహకరించలేదని నాతో చెప్పాడు. "అవును నిజం నేను పరమాచార్య స్వామి వారిని ఆసుపత్రిలో నా ప్రక్కన చూశాను!!!"

***అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణం ।***

***శ్రీచంద్రశేఖర గురుం ప్రణమామి ముదావహం ॥***

***– తిరువణ్ణామలై గౌరీశంకర్ మామ*** *(కంచి పరమాచార్య వైభవం ముఖపుస్తకం నుండి)*

## గురుకృపాలహరి

"మహనీయుల జీవనశైలి జీవనది వంటిది. నది పరవళ్ళు త్రొక్కుతూ అవిశ్రాంతముగా ప్రవహిస్తూనే ఉంటుంది. అట్లే బాబుగారు అహర్నిశలు పరుల సేవయే పరాత్పరుని సేవగా పనిచేస్తూ వచ్చారు. నదివద్దకు వచ్చి, వలసిన వారు దప్పిక తీర్చుకుంటూనే ఉంటారు. 'మునిగినవారికి, మునిగినంత 'మహాదేవ'! అన్నట్లు వారి సాన్నిధ్యంలో తమ తపస్సును సఫలీకృతం చేసుకున్న వారెందరో! ఆర్తితోగాని, జిజ్ఞాసతోగాని, అర్థార్థులుగా గాని వారి నాశ్రయించిన వారెవ్వరూ నిస్పృహలో వెనుదిరిగిపోలేదు. నది మన నుండి ఏమీ ఆశించదు. వారి వారి అవసరాల ననుసరించి జీవులక్కడికి చేరుతారు. వారి

వారి అర్హతలు, హోదాలు, కట్టుబాట్లు, అంతస్తులతో ఆ నదికి ప్రమేయం లేదు. ఎవరి సద్బుద్ధి ననుసరించి వారి వారి పంటలు పండుతాయి అక్కడ! బాబుగారి విషయంలోనూ అంతే!" – 'సన్నిధి' శ్రీ పాకలపాటి గురువు గారి దివ్యచరిత్ర నుండి.



సత్యద్రష్టల సచ్చరితలు–సద్గురుపథ కరదీపికలు. 'జీవనది' అంటే ఏదో ఒక తెలియచెప్పలేని భావన. జీవులన్నింటికి స్వాంతన చేకూర్చే నదీమతల్లి అని భావమా? దేశ, కాల, శీతోష్ణస్థితులెరుగక ఎత్తుపల్లాలకు, భూమి భేదాలకు తేడా చూపక 'దాహం'తో చేరే ప్రతీ జీవి గొంతు తడిపి, ప్రాణం నిలిపి, మనుగడ నిచ్చే మార్గదర్శి అని భావమా? తనలో అంతర్భాగమైన జలచరాల నుండి – చరము, అచరము, జడము, అజడము అయిన ఏ జీవినైనా తనతో తనలో కలుపుకుపోయి కడకు కడలిలో (దైవం) కలిపే హేతువన్న భావమా! లేకపోతే జీవులన్నింటిని అక్కున చేర్చుకుని 'నా(న)ది' అని చెపుతున్న మహోన్నత మర్మమా? ఏమో? ఏదైతేనేం, మనకు మాత్రం మహాత్ముల చరితలు జీవనదీమతల్లుల ఆలింగనాలు – మహాత్ముల చరణాలు జీవనదుల పవిత్ర తీర్థ ప్రాప్తి స్థానాలు. మహాత్ముల లీలాగానాలు – నదీమ తల్లులు మోసుకువచ్చే ప్రేమ సంభరిత స్వేచ్ఛావాయువులు. మహాత్ముల మానస హంసికా దర్శనాలు – నిత్య పుణ్యస్నానాలనాచరించే పవిత్ర పుష్కరాలు. ఎందుకంటే – ఏ మహాత్ముని సచ్చరితను దర్శించినా, శ్రద్ధతో, అంతఃకరణశుద్ధితో పారాయణ చేసినా ఆ చరితలు మనం ప్రయాణించే సద్గురుపథానికి ఊతం కాగలవు – హేతువై, భవబంధాలను దాటేందుకు సేతువై సద్గురు చరణాలను చేర్చగలవు. జీవనది అనగానే సగటు భారతీయునికి గుర్తొచ్చే నది పావన గంగ. గంగోత్రిలో ఉద్భవించే గంగ నిజానికి 'గంగా'నదిగా పరిగణించబడదు. ఐదు ఉప నదులను తనతో కలుపుకున్నాక దేవ ప్రయాగలో అలకనందా, భాగీరధీ నదుల సంగమ ప్రాంగణం నుండి పావనగంగగా అవతరిస్తుంది. అలజడుల, ఉరవళ్ళ, పరవళ్ళ మానవ మానసము భాగీరథిగా భావిస్తే, గంభీర, ప్రశాంత, నిగూఢ, నిర్మలత్వము పవిత్ర అలకనందా సంగమము – మహాత్ముల మానసము. భాగీరధి అత్యంత వేగంగా అలకనందలో కలిసి విశాలగంగగా పరిణమిస్తుంది. మనమూ అంతే! ఎంతటి కఠినాత్ముడే గాని, ఎంత కష్టముల పాల్పడనీ, మహితాత్ముల చరణుచేరాడా! స్వాంతన పొందవలసిందే! శాంతి నొందవలసిందే!

నిజానికి ఎన్నో బాధాతప్త హృదయాలకు, అన్నీ ఉన్నా ఏదో ఒక కలవరపెట్టే వెలితి నిలిచిన



జీవులకు ఆశ్రయస్థానాలు మహితాత్ముల సన్నిధానాలు. ఒకరా! ఇద్దరా! ఎందరో – ఎందరెందరో! నాటి 'చలం', పాల్‌బ్రంటన్ నుండి వేలాదిగా తరలివచ్చే విదేశీ జిజ్ఞాసువులు, ఆర్తులు, అంతులేని ఘనవిజయాలను అందుకుని, తమ జీవితాన్ని దేశానికి అంకితం చేసిన 'కలాం' వంటి మహోన్నత శాస్త్రవేత్తలు ఇలా ఎందరో మనకు మార్గదర్శనం చేస్తూనే ఉన్నారు. మనుష్య జన్మ, మోక్షం (సద్గురు చరణం) కావాలన్న కోరిక, మహా పురుషుల ఆశ్రయం ఇవి మూడు దొరకడం దుర్లభమని పెద్దలమాట. మనకు ఇవి లభిస్తున్నాయంటే ఇది కేవలం పూజ్య గురుదేవుల కరుణ కాక మరేమందాం. కమలం దగ్గర కప్పులాగా ఉండిపోతున్న జీవులకు తన జ్ఞాన మధువును రుచి చూపించి తుమ్మెదలా మలచే ప్రయత్నం శ్రీబాబూజీది. కొన్ని సంవత్సరాల క్రితం 'గురుకృప'లోనే పాల్‌బ్రంటన్ గురించి ప్రస్తావించుకోవడం – భగవాన్ రమణులతో వారి అనుబంధం మననం చేసుకోవడం జరిగింది. ప్రక్క పుటల్లోనే ఉన్న చంద్రశేఖరుల గురించి పూర్తి ప్రస్తావన ఈనాడు చేసుకుంటున్నాం. సద్గురు సంకల్పమే మనకు సకాలం – అమ్మకు తెలుసు ఎప్పుడు తృణధాన్యాలనివ్వాలో – ఎప్పుడు అన్నప్రాసన చేయాలో! తల్లి ఒడిలో తలపెట్టుకుని – ఆకాశంలో చుక్కలు – అందాల సాయిచంద్రుని అనంతానంత లీలా విశేషాల లోగిలిలో, ఆనందాంబుధిలో ఓలలాడటం, కేరింతలు కొడుతూ ప్రతీ క్షణాన్ని ఆస్వాదించడమే మన పని. మానవజాతి మాత్రమే కాదు. జంతు జాలము కూడా ఎలా సద్గురు సన్నిధానాలను ఆశ్రయించాయో చెప్పే ఈ క్రింది అనుభవంతో పరమాచార్యుల లీలా వినోదంలోనికి పరుగుపెడదాం.

అరుణగిరిలో మనమందరం ఎలా ఉండాలో తమ ఆచరణ ద్వారా తెలియచెప్పి, సెంగం మరియు హరూర్ మీదుగా సేలం జిల్లాకు విచ్చేసారు స్వామి. తీర్థమలై కావేరీ జలాలలో పుణ్యస్నానామాచరించి హొగనక్కల్ ప్రాంతంలో విడిది చేసారు. 1930వ సంవత్సరంలో ఉత్తర ఆర్కాట్ జిల్లా చుట్టుప్రక్కల తమ యాత్ర సాగింది. పూసమలైకుప్పమ్ అటవీ ప్రాంతంలో వ్యాసపూజ జరిగింది. అటవీ ప్రాంతమైనా, అక్కడి సద్భక్తులు విడిదికివలసిన ఏర్పాట్లన్నీ చేసారు. స్వామి వారు ఇక్కడ విడిది చేసి ఉండగా మఠ ఏనుగును ఉంచిన షెడ్డుకు రాత్రి పూట నిప్పంటుకుంది. ఆ అగ్ని జ్వాలలకు తాళలేని ఆ గజరాజు తన కట్టు తెంపుకుని అడవిలోకి వెళ్లిపోయింది. ఉదయం లేచిన మఠ వాసులు బూడిదైన షెడ్డును – షెడ్డులో గజరాజు లేకపోవడాన్ని చూసి ఖిన్నులై చుట్టు ప్రక్కలంతా వెదికి జాడలేక అయోమయానికి



గురి అయ్యారు. ఐదుమైళ్ళ దూరంలో ఉన్న ఒక నీటి గుంటలో ఏనుగు ఉండిపోయి అవస్థ పడుతోందని కబురందింది. మావిటివాడు, మఠవాసులు అందరూ ఆ గజాన్ని తీసుకురావడానికి అన్ని ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. చివరకు పరమ కరుణాపూర్ణులైన పరమాచార్య స్వామి ఆ నీటిగుంట వద్దకు వచ్చారు. స్వామి వేంచేసారో లేదో! అప్పటి దాకా ఒక అడుగు వేయని ఆ గజరాజు ఠక్కున లేచి వచ్చేసాడు. అంతేకాదు గురుదర్శనమయితే సచ్ఛిష్యుడు ఎలా సాష్టాంగపడతాడో అలా స్వామి ముందు మోకరిల్లాడు. గమనిస్తే గజరాజు వంటి నిండా కాలిన గాయాలే! స్వామి వెంటనే తమ హస్తస్పర్శతో ఊరడించి, అంతే వాసులకు ఆ గజానికి చేయవలసిన సపర్యలు తెలియచెప్పి వెళ్ళారు. "గురుని చేతిచలువ గజరాజుకు తెలిసెను విలువ – ఆ కరుణా సంబంధ మెరుగుట సులువా". మానసమా మేలుకో! గురువే సర్వమని తెలుసుకో! సర్వకాల, సర్వావస్థల యందు గురుచణాలయందు ఆసక్తి నిలుపుకో! మానసమా! మత్తగజమా గురువే నీ మావటి! ఆ చరణు చేరితే తొలగేను నీలో చీకటి.

1930 డిసెంబరులో పక్షితీర్థంలో అఖిల భారత సాధుసంఘం వారు శ్రీవారికి స్వాగత పత్రాన్ని సమర్పించారు. "జగద్గురునాధ! భరతవర్షపు అజ్ఞానాంధకారాల చీకట్లను మీ జ్ఞానమనే వెలుగులలో తొలగించ అవతరించారు. ఆదిశంకరుల అడుగుజాడలలో నడిచే జీవులకు వారి ఆనంద సన్నిధానాన్ని ప్రసాదించడానికి ఆచరణనే మార్గంగా ఎంచుకున్నారు. జగత్తులో మంచిని నింపడానికై కరుణతో అవతారమెత్తి సద్గురువుగా మాకై విచ్చేసారు. అందుకోండి మా శతసహస్ర ప్రణామాలు. దయా సముద్రమైన జ్ఞాన ప్రకాశమా! మీ పవిత్ర చరణాలు తాకిన ప్రాంతమే కాదు, మీ చరణ స్పర్శకు నోచుకున్న ప్రతీ హృదయము 'మంచి' చేయాలని, ఉన్న స్థితి నుండి ఉన్నతస్థితికి చేరాలని, త్యాగమును అలవరుచుకోవాలని తహతహలాడుతాయి. లుప్తమైపోతున్న భక్తి మార్గాన్ని – జ్ఞాన సద్గురువులైన మీరు పరిప్లావితం చేయడానికే అవతరించారు. సత్యాన్ని, సత్యపథాన్ని మాకు తెలియచెప్పండి. మీ చరణాలకు ప్రేమ పూర్వక నమస్సులర్పిస్తున్నాము. హింసా ప్రవృత్తి ప్రబలి – దైవీభావాలు సన్నగిల్లిపోతున్న ఈ తరుణంలో మీ అనుగ్రహ భాషణంతో మాకు మార్గదర్శనం చేయండి. అద్వైతాధిపతీ! మీ చెంత శిశువులైన మాకు ఆనందాన్ని, ఆధ్యాత్మికాన్ని (దైవత్వాన్ని) రంగరించి పోషణగా అందించమని మనవి చేసుకుంటున్నాము. శరణు! శరణు! శరణు! జగద్గురు శంకర



**ప్రేమ, దయ, క్షమ, కరుణ, జాలి వంటి సత్య సద్గుణాలను పక్షపాతబుద్ధితో చూపితే ఇవి దోషపూరితాలే.**



భగవత్పాద చరణం శరణం."

వినయపూర్వక స్వాగతాంజలి అందుకున్న శ్రీచరణులు అక్కడి వారందరికి ఆశీస్సులనందచేసి జనులందరిని ధర్మమార్గంలో, నిరాడంబరం గానూ, నిజాయితీతోనూ, భగవద్భక్తితోనూ, సాధారణ జీవన విధానాన్ని అలవరుచు కోవడంతోనూ దైవాన్ని సులభంగా అందుకోగలమని చెప్పి మార్గనిర్దేశనం చేసారు.

1931 సం॥ జనవరిలో స్వామి చెంగల్పట్టుకు వేంచేసారు. స్వామి వారి రాకకై చాలా కాలంగా వేచి చూస్తున్న చెంగల్పట్టువాసులు కుల, మత, ధనిక, పేద, చిన్న, పెద్ద భేదాల కతీతంగా ఆనంద సంద్రంలో మునిగి నిత్యమూ స్వామివారిని దర్శనం చేసుకునే వారు. అక్కడి శివాలయంలో స్వామి వారు నిత్యమూ తమ అనుగ్రహభాషణంతో జనబాహుళ్యాన్ని ఆశీర్వదించారు.

స్వామివారు చెంగల్పట్టుకు విజయం చేసిన రోజుల్లోనే ప్రఖ్యాత (ఆంగ్లేయ) పాశ్చాత్య రచయిత, చరిత్రకారుడు, తర్వాతి కాలంలో గొప్పభక్తుడు అయిన పాల్‌బ్రంటన్ స్వామి వారిని దర్శించుకున్నాడు. "సప్త సముద్రాల ఆవలనున్నా, పిచ్చుక కాలికి దారం కట్టి లాక్కున్నట్లు – నా భక్తుడిని నా చెంతకు రప్పించుకుంటానన్న" సద్గురు వాక్యం పాల్‌బ్రంటన్ జీవితంతో చక్కగా సమన్వయ పడుతుంది. పాల్‌బ్రంటన్ – బ్రిటిషు దేశస్థుడైన రచయిత, గొప్ప అన్వేషి, తత్త్వవేత్తగా పేరుగాంచిన బ్రంటన్ అసలుపేరు రాఫెల్ హుస్ట్. లండన్ మహానగరంలో జన్మించిన బ్రంటన్ మొదటి ప్రపంచ యుద్ధంలో ట్యాంకుల విభాగంలో పనిచేసి తర్వాత కాలంలో తన జీవితాన్ని అన్వేషణలో, తత్త్వశోధనలో అంకితం చేసాడు. బ్రంటన్ పేరు, అతని జీవితం భగవాన్ రమణులతో ముడిపడిన తీరు మనకు తెలిసిన విషయమే. అయితే బ్రంటన్ రమణుల చెంతకు రావడానికి దోహదపడిన పరిస్థితులు, వ్యక్తులు... ఇలా గమనించుకుంటూ పోతే సద్గురువు పిచ్చుక కాలికి దారం ఎలా కట్టి తన చెంతకు లాక్కుంటారో అవగతమవుతుంది. ఈ క్రింది అంశాలు బ్రంటన్ రచించిన **నిగూఢ భారతంలో (నా) అన్వేషణ** A search in Secret India **నుండి స్వేచ్ఛానుసరణమని గమనించగలరు.** మద్రాసు వెళ్ళే రోడ్డు చివరన వేచి చూస్తున్న నాకు దగ్గరగా ఒక అపరిచితుడు వచ్చి నిలుచున్నాడు. తల త్రిప్పి చూస్తే పసుపు దుస్తులు ధరించి ఒక యోగిలా ఉంది అతని ఆహార్యం. తప్పిన పలువరుస, ముడతలు పడ్డ కనులు, నవ్వితే దర్శనమిచ్చే పెద్దదైన నోరు. బహుమానంగా నాపై ఒక నవ్వును విసిరాడు." "నాతో మాట్లాడాలి అనుకుంటున్నారా?" అని ప్రశ్నించాను. చక్కటి ఆంగ్లేయుల యాసలో "Yes



Sir'' అని బదులిచ్చాడు. ''భారతదేశంలో మీరు ఏం చేస్తున్నారో తెలుసుకోవచ్చా''? అతని ఉత్సుకత నచ్చని నేను అయిష్టంగానే ''ఏదో తిరుగుతున్నాను! అంతే!''. ''మీరు మా దేశంలోని మహాత్ములను దర్శించాలని ఆసక్తిగా ఉన్నారు కదూ!'' – ''ఏదో కొంత వరకు'' అని నా సమాధానం. ''నేను ఒక యోగిని'' అని సెలవిచ్చాడు అతను. ఇంతకుమునుపు భారీకాయంతో ఉన్న యోగులను చూడని నేను ''మీరు యోగిగా మారి ఎన్ని సంవత్సరాలయింది'' అని ప్రశ్నించాను. ''మూడు సంవత్సరాలు'' ''మీరు ఏమీ అనుకోకపోతే – మీరు యోగిలా అనిపించడం లేదే?'' అని నా పరిప్రశ్న.

సైనికుడిలాగా తన కాళ్ళను రెంటినీ ఒక చోటకు తెచ్చి సావధాన స్థితిలో నిలబడి ''ఇంతకు పూర్వం రాజుగారి వద్ద సైనికుడిగా, భారత సైన్యంలోనూ, పనిచేసి కుటుంబ పరిస్థితుల వల్ల మనోవ్యధకు గురై చివరకు ఆధ్యాత్మిక మార్గంలో యోగిగా మారాను'' అని చెప్పాడు. మీ పేరు తెలుసుకోవచ్చా? అని నేను నా పరిచయ పత్రిక (విజిటింగ్ కార్డు) ఇచ్చాను. అతను ''నా పేరు సుబ్రమణ్య అయ్యర్'' నేను సుబ్రమణ్యను ఇలా అడిగాను. ''మీరు ఇంతకు పూర్వం సంభాషణల్లో చెపుతున్న మౌన స్వామి గురించి తెలుసుకోవచ్చా?'' ''నేను ఇంతసేపు మీ కోసం వేచి చూసింది వారి గురించి చెప్పడానికే! మీకు ఆధ్యాత్మికంగా ఉన్న ప్రశ్నలన్నింటికి మా గురుదేవుల చెంతన సమాధానం లభించగలదు. భారతదేశంలోనే అత్యంత జ్ఞానవరిష్టులు వారు – మీరు అనుకునే యోగులకంటే గూడ!'' అతిశయోక్తిగా భావించిన నేను ''మీరు భారతమంతా పర్యటించారా? యోగులనందరినీ కలిసారా? మీరు ఈ మాట ఎలా చెప్పగలరు?'' అన్నాను. సుబ్రమణ్య – ''నేను దేశంలోని కన్యాకుమారి నుండి హిమాలయాల వరకు పర్యటించారు. పెక్కు మందిని దర్శించాను. అయితే మా గురుదేవుల వంటి వారిని ఇంతవరకు చూడలేదు. వారు గొప్ప మహితాత్ములు. మీరు వారిని తప్పక దర్శించాలి''. ''ఎందుకు'' అని నా ప్రశ్న – ''ఎందుకంటే వారు నన్ను మీ వద్దకు వచ్చేలా చేసారు గనుక – వారి శక్తి మిమ్మల్ని భారతదేశానికి రప్పించింది కనుక''. అని సుబ్రమణ్య సమాధానం. పిడుగులాంటి అతని సమాధానం, ఆశ్చర్యానికి, అతిగా చెపుతున్నాడేమోనన్న శంకకు దారితీసింది. మెల్లగా అన్నాను ''నాకు మీరు చెప్పేది అర్థం కావడం లేదు'' అని అనగానే కొంచెం విశదంగా ఇలా చెప్పాడు. ''సుమారు ఎనిమిది నెలల క్రితం నాకు వారి సన్నిధి లభించింది. ఐదు



నెలలు వారితో ఉండటానికి అనుమతి లభించాక వారు నన్ను మరల నాయాత్రను కొనసాగించమన్నారు. ఇదిగో ఇలా మీతో పరిచయమైంది. నాకు తెలిసి మీరు మా గురుదేవుల వంటి వారిని కలవలేరు. వారి ఆధ్యాత్మిక శక్తి ఎంత గొప్పదంటే వ్యక్తం చేయలేని ఎన్నో ప్రశ్నలకు వారి దర్శనమే సమాధానం. కేవల మాత్ర సమయం చాలు మీరు వారి ఉన్నత స్థితిని అవగతం చేసుకోవడానికి". ఈ మాటలు వినగానే "ఓ ఆంగ్లేయుడనైన నా రాకను వారు స్వాగతిస్తారని మీరు విశ్వసిస్తున్నారా?" "గట్టిగా! వారి యొక్క మార్గనిర్దేశనమే నన్ను మీ చెంతకు తెచ్చింది." "ఎక్కడ నివసిస్తారు వారు?" – "పరమ పవిత్రమైన అరుణగిరి–దక్షిణాపథంలోని ఉత్తర ఆర్కాట్ ప్రాంతంలో ఉంది ఆ పవిత్ర క్షేత్రం. మీరు నన్ను మీ 'గైడ్'గా స్వీకరించండి. మిమ్మల్ని నేను వారి చెంతకు తీసుకువెళ్తాను. పరమ సత్యము నెరిగిన మా గురుదేవులు మీ ఇబ్బందులను, సందేహాలను నివృత్తి చేసి మీకు ఆనందాన్ని అందించగలరు". "మీ మాటలు నాలో చాలా ఉత్సుకతను రేకెత్తిస్తున్నాయి. అయితే అది ఇప్పుడు సాధ్యపడే విషయం కాదు. నా సామాను మొత్తం సర్దడము, ఉత్తర తూర్పు భారతంలో నాకు రెండు ముఖ్యమైన పనులు (అపాయింట్‌మెంట్స్) ఉండటంతో నేను తప్పక ఇక్కడి నుండి వెళ్ళిపోవాలి". "ఇది వాటికంటే ముఖ్యమైనది" అన్నాడు సుబ్రమణ్యం. "క్షమించండి. మనం ఆలస్యంగా కలుసుకున్నాము. ముందుగానే చేసుకున్న ఏర్పాట్లను మార్చుకోవడం సులభంకాదు. నేను మరల దక్షిణ భారతానికి రావచ్చునేమో! ప్రస్తుతానికి మాత్రం నేను వెళ్ళవలసిందే!" నిరుత్సాహపడ్డ సుబ్రమణ్య "మీరు గొప్ప సదవకాశాన్ని కోల్పోతున్నారు" అనడంతో భంగపడ్డ నేను "ఇక నేను వెళ్ళాలి – సెలవీయండి" అని చెప్పాను. "మీరు రాకపోవడాన్ని నేను అంగీకరించను" అంటూనే "రేపు సాయంత్రం మీ మనసు మార్చుకొని నన్ను పిలుస్తారని ఆశిస్తాను'' అన్నాడు. ఇలా మా ఇద్దరి సంభాషణ అర్థాంతరంగా ముగిసింది. అతని మాటల్లోని ఆత్మ విశ్వాసాన్ని అతని హావభావాల్లో ఉన్న స్థైర్యాన్ని మాత్రం నేను ఇంకా మరిచిపోకున్నాను. అతను వారి గురువుగారి గురించి చెప్పిన దాంట్లో అర్ధభాగం సత్యమైనా సరే నేను ఇబ్బందిపడి దక్షిణాపథానికి వెళ్ళడంలో ఉపయోగం ఉంటుంది. ఇంతకు మునుపు కొందరు శిష్యులు వారి గురువుల గురించి ఇలాగే పెద్దది చేసి చెప్పుడము, నేను తర్వాత భంగపడటము – అంతేకాక నిద్రలేని రాత్రులు, అలసిపోయిన శరీరము యొక్క పరిస్థితి–నన్ను కొంత నిరాసక్తుడిని చేసాయి. కానీ, సుబ్రమణ్య యొక్క విశ్వాసం, రాజీలేని



అతని సంకల్పం ఎందుకో నేను ఒక నిజమైన యోగిపుంగవుని సన్నిధానాన్ని కోల్పోతున్నానన్న భావనలోకి నెట్టివేసింది. ఎంతప్రయత్నం చేసినా ఆ భావాన్ని తొలగించుకోలేక పోయాను. రాత్రి గడిచింది. నా అంతః ప్రవృత్తి మాత్రం నన్ను గట్టిగా హెచ్చరిస్తూనే ఉంది సుబ్రమణ్య మాటల్లో స్పష్టత, స్వచ్ఛత ఉన్నాయని, నేను నిజమైన మహాత్ముని దర్శనాన్ని కోల్పోయే అవకాశం ఉందని.

తెల్లవారింది, నా అల్పహార సమయానికి నా కోసం ఒక అతిథి వచ్చారని చెప్పాడు పరిచారకుడు. అతనెవరో కాదు ప్రఖ్యాత రచయిత శ్రీవెంకటరమణి. ఇంతకమునుపు వారిని కలవాలని ప్రయత్నించినా అది సాధ్యపడలేదు. మద్రాసు ప్రెసిడెన్సీలోని మొదటి తరం ఆంగ్ల రచయితల్లో వారు అగ్రగణ్యులు. భారతదేశంలో రవీంద్రనాధ్ ఠాగూర్ మొదలు బ్రిటిషులో లార్డ్‌హల్దానే వంటి వారిచే ప్రస్తుతించ బడినవారు.

అత్యున్నతస్థాయి రచనల్లో వారు చేసే భాషా, ఉపమాన ప్రయోగాలే కాక ఒక సామాన్య రైతుయొక్క వ్యధాభరిత స్థితిని సులభమైన మాటల్లో వర్ణించగల గొప్పరచయిత వారు. ఒకరినొరకం పలకరించుకున్నాక సమకాలీన రాజకీయాల నుండి ఇష్టమైన రచయితల వరకు ప్రతీ విషయాన్ని నిర్మొహమాటంగా చర్చించుకున్నాము. శ్రీవెంకటరమణితో నేను భారతదేశానికి ఎందుకోసంగా వచ్చాను – నిజమైన యోగులను దర్శించాలన్న నా కుతూహలాన్ని , ఏదో నేర్చుకోవాలన్న నా తపనను వ్యక్తం చేయకుండా ఉండలేకపోయాను. అంతేకాదు, కపట సాధువులను దర్శించి, నా సమయాన్ని వృధా చేసుకోలేనని విస్పష్టంగా తెలియచేసాను. 'నిజమైన మహాత్ములు' అనే మాట విన్న వెంకటరమణీ తల అడ్డంగా ఊపుతూ "భారతదేశం ఒకప్పుడు అలాంటి వారికి నిలయమై ఉండేది. భౌతికమైన కోర్కెలపట్ల ఆసక్తి అంతకంతకు పెరగడం, పాశ్చాత్య పోకడల పట్ల ఆసక్తి – మీరు ఆశించే సాధుసత్తములకు భారతదేశం అరుదుగా ఆశ్రయమవుతోంది. ఉన్నవారు కూడా ఎక్కడో జనబాహుళ్యానికి దూరంలో వనాలలో వసిస్తున్నారు. తమ జీవితం మొత్తం అలాంటి మహితాత్ముల ఆశ్రయానికై అన్వేషిస్తున్న భారతీయులకు కూడా వారి సాహచర్యం గగనమవుతున్న సమయంలో, ఆంగ్లేయులైన మీకు ఆ భాగ్యం లభించడం ... (సందిగ్ధం) "అయితే మీరు నా కోర్కె తీరడం కష్టమంటారా?" అన్నాను. "చెప్పలేము – ఏమో మీకు ఆ అదృష్టం ఉంటే..." ఎందుకు అడిగానో తెలియదు.



"మీరు ఉత్తర ఆర్కాట్‌లో వసించే మహర్షి గురించి విన్నారా? అని అడిగాను. వెంకటరమణి "నాకు తెలియదు" అని చెప్పారు. ప్రాచీన హిందూ సాంప్రదాయాలు, అవి కాలం చెల్లిపోతున్న తీరు, సామాజిక స్పృహ, సేవ, ఆధ్యాత్మిక లక్ష్యాలు... ఇలా ఎన్నో భావాలను మనఃస్ఫూర్తిగా పంచుకున్నాక, గ్రామాలు కూడా ఎలా భౌతికత వైపు మరలిపోతున్నాయో చెపుతూ, తన ఆవేదన వెలిబుచ్చాడు వెంకటరమణి. అతని భావాలను తన కోణం నుండి అర్థం చేసుకునేంతలోనే – లేచి నిలబడ్డాడు. చూస్తుండగానే నాకు ధన్యవాదాలు చెపుతూనే వెళ్లిపోయాడు.

తర్వాత రోజు ఉదయం ఉన్నట్టుండి వెంకటరమణి మా ఇంటికి రావడము, గేటును తోసుకుంటూ ఎంతో ఉత్సాహంతో నా దగ్గరకు రావడం జరిగింది. నేను ఆశ్చర్యపోయాను. వస్తూనే "నాకు రాత్రి పొద్దుపోయాక తెలిసింది. నాకు ఎంతో శ్రేయస్సును చేకూర్చిన గొప్ప మహితాత్ములు చెంగల్పట్టులో విడిది చేసారని" పరిగెత్తుకు వచ్చిన తాను కొంత ఊపిరి పీల్చుకున్నాక ఇలా చెప్పాడు. "దక్షిణా పథానికి ఆధ్యాత్మిక సారథి అయిన జగద్గురు శంకరాచార్యులు చెంగల్పట్టులో విడిది చేసారు. లక్షలాది మంది వారి జగద్గురువులుగా, ఆచార్యులుగా భావిస్తారు. వారే నన్ను రచయితగా ప్రోత్సహించింది. నా సాధనలో ఎదురయ్యే సందేహాలకు వారే మార్గదర్శి. నిన్న మీతో చెప్పడానికి సందేహించింది వారి గురించే! మేము వారిని ఆధ్యాత్మిక సిద్ధి పొందిన మహాపురుషులుగా భావిస్తాము. అయితే వారు యోగమార్గము ప్రబోధించే వారుకాదు. వారు హిందూ ధర్మ పరిరక్షకులు, నిజమైన మహాత్ములు, మరియు గొప్ప తత్త్వవేత్త. ఆధ్యాత్మిక జగత్తులో వారికి తెలియని అంశము ఉండకపోవడము, అత్యున్నతస్థితిని పొందినట్లు తెలిపే వారి ఆచరణ, జ్ఞానమార్గంలో వారు ఉన్నతులు అని తెలియచెపుతాయి. గ్రామాలు, పట్టణాలు ఇలా ప్రతీ ఊరూ, వాడా భారతదేశమంతా తమ అనుగ్రహ చరణాల నిడి, ఏది సరైన ధర్మమో నుడివి, జాతిని భక్తిపథంలో ముందుకు తీసుకువెళు తున్నారు వారు. ఎందరో సామాన్యులు, సాధువులు, జ్ఞానులు. ఇలా ఎందరో వారి దర్శన, స్పర్శలతో ధన్యులయ్యారు.

కొన్ని ప్రశ్నలకు కాలమే నిజమైన సమాధానం చెప్పగలదు. సద్గురు అనుగ్రహ చిరుజల్లు ఎప్పుడు కురుస్తుందో మనం చెప్పగలమా? బ్రంటన్ ఎలా సద్గురుచరణాలను చేరాడు? ఎవరు చేర్చారు? ఆలోచిస్తూ మనం కూడా గురుచరణాలను చేరుదాం... గురువు పూర్ణచంద్రుడు... కరుణరసపూర్ణుడు.. సద్గురు చరణం శరణం... శుభం భవతు...

**– గురుకృప**

# మూలానికి మూలం... ప్రేమ కరవాలం



గురుబంధువులకు నమస్కారము. నాపేరు డా॥ శ్రీనివాసులరెడ్డి, ఒంగోలులో వైద్యవృత్తి. శ్రీసమర్ధ సద్గురు సాయినాధుని అనుగ్రహ ఫలంగా సద్గురు బాబూజీ వారి సన్నిధి భాగ్యం లభించింది. శ్రీబాబూజీ వారి కృపతో వారి నుండి ఉపదేశయోగ్యతా లభించింది. సాయినాధుల వారు కూడా వారి మొత్తం జీవితంలో ఒకసారి ఒక భక్తునితో నేను అల్లాను (మై అల్లా హు) అని చెప్పారని, ఎప్పుడూ నేను అల్లా బానిసను అనేవారు ఒకే ఒకసారి అలా చెప్పారని సాయిచరిత్రలో ఉంది. అలాగే శ్రీబాబూజీ వారు కూడా ఒక సందర్భంలో వారు నిజ(స్వ)స్థితిని ఒక సన్నివేశం ద్వారా నాకు తెలియపరిచారు. ఆ సందర్భాన్ని మీతో పంచుకుంటున్నాను.

శ్రీబాబూజీ ఒంగోలులో స్కూలు నడుపుతున్న రోజులవి. వారితో కలసి, మెలసి జీవించగలిగే భాగ్యం కలిగింది. వారు ఒకసారి నాకు ఏదోపని చెప్పారు. ప్రతి పనిని నాలో అవగుణాలను పోగొట్టి నా సాధనకు దోహదం చేసేటట్లుగా నాచేత చేయించేవారు. నా అలసత్వం వలన, సోమరితనం వలన ఆ పనిని చేయలేదు. పని అయిందా అని అడిగారు. చేయలేదు చేస్తాను అని చెప్పాను. రెండు రోజుల తరువాత మళ్లీ అడిగారు. మళ్లీ చేయకపోగా ఏదో సాకు చెప్పి తప్పించుకున్నాను. ఏమీ మాట్లాడకుండా ఉండిపోయారు. మళ్లీ నేను ఆ పని చేయలేదు. రెండురోజులాగి మళ్లీ 'చేసారా'? అని అడిగారు. అప్పటికీ చేయలేదని చెప్పకుండా ఏ విధంగా అబద్ధం చెప్పి తప్పించుకోవాలా అని కారణం వెదుకుతున్నాను.

నాలోని అబద్ధానికి రూపు ఏర్పడక ముందే వారు నావైపు ఒకసారి సీరియస్‌గా చూసి "ఏమనుకుంటున్నారు? నేను మీ SOURCE OF THOUGHT (ఆలోచనకు మూలం) కంటే కూడా లోతుగా వున్నాను" అని చూపుడువేలు చూపుతూ కోపంతో (జాగ్రత్త అన్నట్లు) అన్నారు. ఒక్కసారిగా లోపల వణుకు పుట్టింది. అబద్ధం చెప్పాలన్న తలంపు విరిగిపోయింది. నా మీద నాకు అసహ్యం వేసింది. నా మనస్సు స్తబ్ధుగా మారిపోయింది. వారిని చూడాలంటే సిగ్గు, భయం పుట్టి వారి ముఖంలోకి చూడలేకపోయాను. భగవాన్ రమణమహర్షి మనలోని 'నేను'ను చూసుకునేటపుడు SOURCE OF THOUGHTను చూసుకో అంటారు. ఆలోచనల మూలం కన్నా అంతర్లీనంగా నాతో వున్నారంటే సద్గురు దేవులు ఏమై వుండాలి? నాలో ఉండే వారి ఎఱుకను ఆ క్షణం నుండి అన్వేషిస్తూనే ఉన్నాను. నా అన్వేషణ అంతమయ్యేది ఎప్పుడో సద్గురుదేవులకే ఎఱుక. వారి కృపతో తప్ప నా అన్వేషణ పూర్తికాదు. నాలోనే గూఢంగా వున్న నా సద్గురుదేవునికి నా మనస్సనే సుమాన్ని అర్పిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

***– డా॥ శ్రీనివాసుల రెడ్డి, ఒంగోలు***

**మనచుట్టూ ఉన్న ఆనందాన్ని గుర్తించగలిగే దృష్టిని ఇవ్వమనడమే ప్రార్ధన పరమార్ధం.**



# తన్మయత్వపు తావు నుండే పేరు మరచిన ప్రేమతత్వం

## ఇన్ లవ్ వి లూస్ అవర్ సెల్వ్స్ అండ్ ఇన్‌లూసింగ్ వి గైన్

అన్నీ మరచిపోయి, ఎవరు ఏమిటి, వాళ్ళ పొజిషన్ ఏమిటి, వాళ్ళ పదవి ఏమిటి మరచిపోయి అక్కడ నామీద ఫోకస్‌తో వాళ్ళు తోసుకొని వచ్చేటప్పుడు, అది నాకు నచ్చేది. తోసుకోవడం కాదు నచ్చేది. ఆ తోసుకునే ప్రోసెస్‌లో వాళ్ళని వాళ్ళు, వాళ్ళు ఏమిటి అని మరచిపోతారు చూసారా అది. ఎన్ని జపాలు, యాగాలు చేసినా కూడా రానటువంటి స్థితి అది. అది కొద్దిక్షణమేగాని, మనలని మనం మరచిపోయే స్థితి ఉంటుంది.

మనలను మనం మరచిపోయి, మనం ప్రేమించేటటువంటి ఫార్మ్ పట్ల మనకు ఉండేటటువంటి ఫోకస్, ఆ ఒక్క నిముషమే కావచ్చు, అర నిముషమే కావచ్చు. ఆ మనసుకు కలిగేటటువంటి స్థితి, అది నాకు చాలా ఇష్టమైనది.

**“అహము వదిలేయుటే సాయిపథము”** - మహా మంత్రం క్రింద పెట్టుకోండి. అహము అంటే ఏమిటి, నేనెవరు, నేను ఫలానావాడిని. ఏ ఊరి వాడిని, ఏ సామాజిక వర్గానికి చెందినవాడిని, నేను ఏ ఉద్యోగాలు చేస్తుంటాను, ఇవన్నీ కాక మీపట్ల మీకుండేటటువంటి అభిప్రాయం. అది **ఇగో** అంటే.

మంచి నిద్రపోయి ఠక్కున లేచాము. ఫస్ట్ మనకు జ్ఞాపకం వచ్చేటటువంటిది మనమెవరు అనేటువంటిది. మన పేరు. That is the basic identity. మన ఐడెంటిటీ కార్డు ఉందనుకోండి..మన ఐడెంటిటీ కార్డులో ప్రామినెంట్‌గా ఉండేది మన పేరు. ఆ తరువాత మిగతా డిటెయిల్స్ ఉంటాయి. అందుకనే వ్రాసింది నేను. తన్మయత్వపు తావు నుండే పేరు మరచిన ప్రేమతత్త్వం. ఆ పేరు కూడా మరచిపోగలగాలి.

మంచి డీప్ నిద్రలో ఉండేవాడిని లేపామనుకో, కొన్ని సెకన్స్ పడుతుంది, మనమెవరో మనకు తెలియడానికి, మనం తెలిసేటప్పటికి ప్రపంచం తెలుస్తుంది. అది భ్రిగ్భాంతితో కూడినటువంటి తెలియనితనం. అదే ప్రేమతో ఉండేటటువంటి తన్మయత్వం గాని వచ్చినట్లయితే, అక్కడ బాబా ఉంటారు. అది సాధించడానికే ఈ ప్రయత్నం అంతా కూడాను.

ఆ తన్మయత్వపుస్థితి, అది ఉంటే, మన జీవితం ఆనందజీవనం సాయిపథము అవుతుంది. ఆనందం ఉంటుంది, రక్షణ ఉంటుంది. ఇంకా దేనికీ ఆలోచించాల్సిన అవసరంలేదు. ఆ తన్మయత్వపు తావుకు చేరాలంటే పోగొట్టుకోవలసింది ముందు ఇది. అది పోగొట్టుకొనేదానికి ఈ సత్సంగాలు దోహదం చేయాలి.

**-శ్రీబాబూజీ**



**భక్తుడు :** గురువుగారూ, మేము మారడానికి, పరివర్తన చెందడానికి కావలసిన సంసిద్ధతను పెంపొందించుకోవడం ఎలా?

**గురువుగారు :** మీకు ఆ అవసరం, కోరిక ఉండటం వలన. మీకు కావలసినదేమిటో మీరు తెలుసుకున్నప్పుడు, మీ ధ్యేయం ఏమిటనేది మీకు తెలిసినప్పుడు వచ్చే రసాత్మకతనే మనం ప్రేమ అంటాము, అదే నిన్ను వృద్ధి చేస్తుంది. అప్పుడు నువ్వు పరివర్తన చెందుతావు. ఆ ప్రేమ మనలోని అభివృద్ధికి కారణమైన పోషకంగా మారుతుంది.

**భక్తుడు :** నా లక్ష్యం నా ప్రేమకు ఆధారమైన లక్ష్యాన్ని (సద్గురువును) నేను తెలుసుకోగలిగితే?

**గురువుగారు :** ప్రేమకు లక్ష్యం అని కాదు. నువ్వు ప్రేమించే ఆ లక్ష్యం నీ అవసరం మీద ఆధారపడి వుంటుంది. నీకు అవసరమైన దానినే నువ్వు ప్రేమిస్తావు అంతే, అందుకనే మొదట నీకు ఏమి కావాలో నువ్వు తెలుసుకోవాలి. అప్పుడు ఆ లక్ష్యాన్ని ప్రేమిస్తావు. లేదా ఆ లక్ష్యానికి నిన్ను చేర్చే మార్గాన్ని ప్రేమిస్తావు. అదేదైనాగాని అవి రెండూ ఒక్కటే దాని ఫలితంగా కలిగే రసాత్మకానుభవమే **ప్రేమ.**

**భక్తుడు :** ప్రేమను ఎలా వికసింపజేసుకోవాలి, ఎలా పరిపుష్టం చేసుకోవాలి, ఎలా సంవృద్ధం చేసుకోవాలి, ఎలా పెరిగేలా చేసుకోవాలి అని ఆమె అడుగుతోంది.

**గురువుగారు :** ప్రేమ పెరిగేలా చేయడానికి పద్ధతిగానీ, ఒక ప్రక్రియగానీ ఏమీలేదు. ఒక్క విషయం మాత్రం చెప్పుకోవచ్చు. నీలో ప్రేమ ఉందని, నీకు ఆ ప్రేమ యొక్క అవసరముందని తెలుసుకున్నప్పుడు, ఇంకా నువ్వు దానిని అనుభూతం చేసుకోవాలనుకున్నప్పుడు – ఆ ప్రేమను అత్యధికంగా పరిపుష్టం చేసేటటువంటి వాతావరణంలో నిన్ను ఉంచుకోవడానికి ప్రయత్నించాలి లేదా అటువంటి వాతావరణాన్ని నువ్వు ఏర్పాటు చేసుకోవాలి. అప్పుడు ప్రేమ దానికదే పెరుగుతుంది. అంటే ఎక్కడైతే నీ ప్రేమకు అడ్డంకులు లేకుండా ఉంటాయో అది. అక్కడ ప్రేమను పొందడానికి, ఆ ప్రేమను అనుభూతి చెందడానికి ఎక్కువ అవకాశాలుంటాయి. ఎక్కడైతే ఆ ప్రేమ రకరకాల వారికి రకరకాల రూపాల్లో అనుభవమవుతూ, వారితో పంచుకోబడుతూ ఉంటుందో అటువంటి వాతావరణం. అక్కడ నీకు సరైన వాతావరణం ఉన్నట్లు లెక్క.

నువ్వు అటువంటి వాతావరణంలోనన్నా ఉండాలి లేదా నువ్వు అటువంటి వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోగలిగన్నా ఉండాలి – నేను రెండూ చెప్పాను. ఒకవేళ అటువంటి వాతావరణం లేకపోతే నువ్వే దానిని సృష్టించుకోవాలి. ఎప్పుడూ అటువంటి వాతావరణంలో ఉండటం మీదే ఆధారపడటం సరైనది కాదు. అటువంటి వాతావరణాన్ని సృష్టించుకునే సామర్థ్యమూ కలిగివుండాలి. సత్సంగంతో ఉండటం, సత్సంగాన్ని ఏర్పాటు చేసుకోవడం, అదే రకమైన ఆలోచనా దృక్పథం ఉన్నవారితో కలసివుండటం, వారితో ప్రేమను పంచుకోవడం. ఇలా మీ ప్రేమను పంచుకోండి. ***– ప్రేమతత్త్వం (శరశ్చంద్రికలు జూలై 2012)***



## "అన్నిటికిని ఇది పరమౌషధం"

భవరోగాల నుండి భౌతిక రుగ్మతల వరకు అన్ని అనారోగ్యాలను నివారించగలిగే వైద్యుడు భగవంతుడు. శరీర బాధలనే కాదు, సంసార బాధలను కూడా సులువుగా సమసిపోయేలా చేయగల చికిత్సకుడు ఆ చిన్మయాకారుడు. ఇలా తానే కాక, తన నామం, తన చింతన, తన చరణామృతం, తన భజన, తన చరితామృతం అన్నింటినీ ఔషధాలుగా మలచి మనల్ని పరిరక్షిస్తున్నాడు ఆ పరమాత్మ. ఆ మాధవుడి మందు మనపై ప్రభావం చూపాలంటే ముందు మనకు ఆయనపై విశ్వాసం, గురి కుదరాలి.

**విమలౌషధం, దివ్య ఔషధం, సిద్ధౌషదం, ముఖ్యౌషధం, నిత్యౌషధం - అన్నీ సద్గురువే.**

నామస్మరణం - మలినాలను తొలగిస్తుంది కనుక - విమలౌషధం.

వారి చరణాలు చూపిన మార్గాన నడవడం - చరణామృతం - దివ్యౌషధం .

అంతటా అన్నిటా ఉన్న ఆయన్ను దర్శించడం - నిత్యౌషధం.

నిత్యప్రార్ధన, పారాయణ. సత్సంగం-సాంగత్యం-ముఖ్యౌషధం.

సంసిద్ధతను ఇచ్చేది - సిద్ధౌషధం.

- అన్నమాచార్యులు